ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
7
బుధవారం 30 అక్టోబరు 2024


రైల్వేకోడూరులో బాణాసంచా దుకాణాల ఏర్పాటుకు జరుగుతున్న పనులు

సిండికేటుతో..
బాణాసంచా ధరలు పైపైకి

- ఖద్దరు అండతో నిబంధనలకు పాతర
- మామూళ్ల మత్తులో జోగుతున్న అధికారులు



రైల్వేకోడూరు, అక్టోబరు 29:(ఆంధ్రజ్యోతి) ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలో బాణాసంచా దుకాణాల్లో నిబంధనలకు పాతరేస్తున్నారు. అధికారులు మామూళ్ల మత్తులో జోగుతుండడంతో తూతూ మంత్రంగా తనిఖీలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీన్ని ఆసరాగా తీసుకున్న బాణాసంచా లైసెన్సుదారులు సిండి కేటుగా మారి నిబంధనలను గాలికి వదిలేస్తున్నారని రైల్వేకోడూ రులో చర్చ సాగుతోంది. నాసిరకం కంపెనీల బాణాసంచాను విక్రయాలు చేసేందుకు సిద్ధం చేసుకున్నారు. అదే విధంగా దుకాణాలు ఏర్పాటు కాక మునుపే స్టాకు పాయింట్లలో విక్ర యాలు చేస్తున్నారు. సిండికేటుగా మారడంతో బాణాసంచా ధరలనూ అమాంతం పెంచేశారు. వివరాలు ఇలా.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒకరికి ఒక్క బాణాసంచా దుకాణం లైసెన్సు మాత్రమే ఇవ్వాల్సి ఉంది. రైల్వేకోడూరులో గత ఏడాది 36 మందికి లైసెన్సు ఇచ్చారు. అయితే.. ఒక వ్యక్తి ఇంటిలో 5, 3, 2 లైసెన్సులు కూడా ఉన్నాయి. అధికారులు సక్రమంగా పరిశీలించకుండానే లైసెన్సులు ఇచ్చారని పలువురు విమర్శిస్తున్నారు. కొందరు లైసెన్సుదారులు వీటిని ఇతరులకు ఇచ్చి కొంత పర్సంటేజీ తీసుకుంటున్నారు. ఈ ఏడాది కూడా ఇదే తంతు సాగుతోందని అంటున్నారు. ఈ వ్యవహారంలో కొందరు ఖద్దరు నేతలు అండగా నిలిచి మా ప్రభుత్వం ఉంది.. మీరు ఏమైనా చేసుకోండి అని హామీ ఇవ్వడంతో బాణాసంచా విక్రయ దారులు రెచ్చిపోతున్నారు. బాణాసంచా దుకాణదారులు అందరూ సిండికేట్‌గా మారి ఇష్టారాజ్యంగా నాసిరకం కంపెనీలవి తెచ్చి విక్రయాలు చేస్తున్నారని బాహాటంగా చర్చసాగుతోంది. బాణాసంచా దుకాణాలు దీపావళికి ఏర్పాటు చేయాలంటే చాలా నిబంధనలు ఉన్నాయి. మొదట అగ్నిమాపకశాఖ, విద్యుత్, పోలీసు, రెవెన్యూశాఖల అధికారులతో కమిటీ ఉంటుంది. వీరు చెప్పే స్థలంలోనే బాణాసంచా కేంద్రాలు ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం రైల్వేకోడూరులో 36 మందికి మాత్రమే లైసెన్సు ఇచ్చారు. రైల్వేకోడూరు మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీ పరిధిలోని ఇళ్ల ప్లాట్ల స్థలంలో బాణాసంచా విక్రయాల ఏర్పా టుకు రెవెన్యూ శాఖాధికారులు అనుమతి ఇచ్చారు. బాణాసంచా దుకాణ యజమానుల్లో ఇద్దరు వ్యక్తులు కీలకంగా వ్యవహరించారు. వారికి ఖద్దరు బాబుల అండ ఉంది. భూమి చదును, ప్లానింగ్ తదితరాల కోసం అధికారులకు ముడుపులు ఇచ్చారని.. అలాగే దుకాణ దారుల దగ్గర నుంచి జీఎస్‌టీ కోసం రూ.10,000, నాలుగు సంతకాల కోసం రూ.16,000, స్థలం బాడుగ తదితర వాటి కోసం రూ.20,000లు వసూలు చేశారని సమాచారం. మొత్తంగా ఒక్కో దుకాణం నుంచి రూ.46,000లు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కీలక పాత్ర పోషిస్తున్న వారు ఈ తతంగాన్ని నడిపిస్తున్నారు. ఇంత పెద్ద మొత్తంలో ముడుపులు ఇవ్వడంతో దుకాణదారులు ఇష్టారాజ్యంగా ధరలు పెంచి విక్రయాలు సాగించే అవకాశం ఉందని సామాన్యులు వాపోతున్నారు. బాణాసంచా విక్రయాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి.

అధికారులు ఏమంటున్నారంటే

బాణాసంచా వ్యాపారుల నుంచి ముడుపులు తీసుకోలేదని అగ్నిమాపక కేంద్రం అధికారి విజయభాస్కర్ తెలిపారు. బాణాసంచా వ్యాపారులందరూ నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. ఎవరు నిబంధనలు పాటించకున్నా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైల్వేకోడూరు సీఐ కే.హేమసుందరరావు మాట్లాడుతూ మామూళ్లు తీసుకోలేదని, అనుకూలమైన వాతావరణంలో బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని, ప్రభుత్వ నిబంధనలు పాటించాలని దుకాణ దారులకు వివరించామన్నారు. తహశీల్దార్ మహబూబ్‌చాంద్ మాట్లా డుతూ బాణాసంచా దుకాణాలకు అనుకూలమైన స్థలం కావాలంటే అనుమతి ఇచ్చామన్నారు. తాను మూడు రోజులుగా అందుబాటులో లేనని తెలిపారు. విద్యుత్ శాఖ ఏడీ భాస్కర్‌రావు మాట్లాడుతూ దుకాణాలు ఏర్పాటు చేసిన ప్రాంతంలో విద్యుత్ వైర్లు ఉన్నాయా లేవా, దుకాణాలకు సక్రమంగా విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేసుకున్నారా లేదా అనేది మాత్రమే చూస్తామన్నారు. దుకాణదారుల ముఖాలు కూడా తమకు తెలియవని వివరించారు.

నిబంధనలు ఇలా

చుట్టుపక్కల నివాసాలు ఉండని విశాలమైన స్థలంలో బాణాసంచా దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలి. ఒక దుకాణానికి మరో దుకాణానికి మధ్య 5 మీటర్లు ఉండాలి. దుకాణం వద్ద ఎలాంటి డెకరేషన్ ఉండరాదు. అగ్ని ప్రమాదాలు జరగకుండా ఉండడానికి అగ్ని నిరోధక పరికరాలు, రెండు బకెట్ల ఇసుక, 200 లీటర్ల నీటి డ్రమ్ము ప్రతి దుకాణం వద్ద ఉండాలి. కొవిడ్ నిబంధనలు పాటించాలి. చిన్న పిల్లలను దుకాణాల్లోకి రానివ్వకుండా ఉండాలి. ఫోకస్ లైటింగ్ ఉండరాదు. ఎవరి పేరుపై లైసెన్సు ఉంటుందో ఆ వ్యక్తే దుకాణాన్ని పర్యవేక్షించాలి. మోటారు బైక్‌లు దూరంగా ఉంచాలి. దుకాణాల వద్ద ఈ ఏడాది వాటర్ పంపు ఏర్పాటు చేసుకోవాలని అగ్నిమాపక శాఖ అధికారులు ఆదేశించారు. అయితే జిల్లాలో చాలా చోట్ల దుకాణాల వద్ద ఈ ఏర్పాట్లేవీ లేవని అంటున్నారు.

అనుమతి గోరంత..
నిర్మాణం కొండంత

- రెసిడెన్షియల్ నిర్మాణానికి అనుమతి... ● కమర్షియల్ భవనాల నిర్మాణం
- రూ.1.64కోట్ల మున్సిపల్ ఆదాయానికి గండి
- వంకనూ ఆక్రమించి కంచె

మదనపల్లెటౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలో మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో సుమారు రూ.1,64కోట్ల ఆదాయానికి గండి పడుతోంది. పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తులు రెసిడెన్షియల్ బిల్డింగ్ నిర్మాణానికి గోరంత స్థలంలో అనుమతి పొంది.. ఏకంగా ఎకరా స్థలంలో నిర్మాణాలు చేపట్టారు. వివరాలిలా..

మదనపల్లె పట్టణం రింగ్‌రోడ్డు పక్కన బీకేపల్లె రెవెన్యూ గ్రామంలో ఇద్దరు వ్యక్తులు 217.86 చదరపు మీటర్ల స్థలంలో రెసిడెన్షియల్ నిర్మాణాలకు మున్సిపాలిటీకి దరఖాస్తు చేసుకున్నారు. కాని ఎకరా స్థలంలో పెద్ద ఫంక్షన్‌హాల్ నిర్మాణం పూర్తిచేశారు. ఇక్కడ వీరు కేవలం 217 చదరపు మీటర్ల స్థలానికి మాత్రమే మున్సిపాలిటీకి బిల్డింగ్ లైసెన్సు ఫీజు కింద రూ.3,080, వేకెంట్ ల్యాండ్ డెవలప్‌మెంట్ ఫీజు రూ.1,600, అప్రూవల్ ఫీజు రూ.4,470, గార్డు ఫీజు రూ.1000, 14శాతం ఓపెన్ స్పేస్ చార్జెస్ రూ.4,50,571, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ చార్జెస్ రూ.5,960, యూజర్ చార్జి రూ.500 కలిపి మొత్తం రూ.7,37,992 చెల్లించి రశీదు తీసుకున్నారు. వీరు నిర్మాణం చేపట్టింది ఎకరా స్థలం. అంటే దాదాపు 4,849 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఫంక్షన్ హాల్ నిర్మించారు. ఈ లెక్కన మదనపల్లె మున్సిపాలిటికి రూ.1.64 కోట్ల ఫీజు చెల్లించాల్సి ఉంది. దీంతో పాటు ఈ నిర్మాణం పక్కనే ఉన్న వంకను ఆక్రమించుకుని ఇనుప కంచె వేశారు. రింగురోడ్డు పక్కనే ఇంత పెద్ద ఫంక్షన్ హాల్ నిర్మించినా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు ఈ అనుమతి లేని భవన నిర్మాణాలపై లోతుగా విచారిస్తే, ప్రభుత్వ ఆదాయం పెరిగే అవకాశం ఉంది.


మదనపల్లెలో మున్సిపాలిటీ అనుమతికి మించి నిర్మించిన ఫంక్షన్‌హాల్

విచారించి చర్యలు తీసుకుంటాం

మదనపల్లె రింగ్‌రోడ్డు పక్కన నిర్మించిన భవన నిర్మాణంపై వచ్చిన ఫిర్యాదుపై క్షేత్ర స్థాయిలో విచారిస్తాం. రికార్డుల ప్రకారం ఎంత విస్తీర్ణానికి అనుమతి తీసుకున్నారు. ఫీల్డులో నిర్మాణం చేపట్టారో పరిశీలించి, తగు చర్యలు తీసుకుంటాము.

- కె.ప్రమీల, మున్సిపల్ కమిషనర్, మదనపల్లె

జిల్లాను టూరిజం హబ్‌గా అభివృద్ధి చేయాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో హార్సిలీహిల్స్, గుర్రంకొండ వంటి ప్రాంతాల్లో అడ్వెంచర్ పర్యాటకానికి మంచి అవకాశాలు ఉన్నాయని దీనిని దృష్టిలో పెట్టుకొని అన్నమయ్య జిల్లాను అడ్వెంచర్ టూరిజం హబ్‌గా అభివృద్ధి చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా టూరిజం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగభూషణం జిల్లాలో పర్యాటక రంగానికి ఉన్న మంచి అవకాశాలు, సవాళ్ల గురించి కలెక్టర్‌కు వివరించారు. అన్నమయ్య జిల్లాలో హార్సిలీ హిల్స్‌లో అడ్వెంచర్ టూరిజంకు మంచి అవకాశాలు ఉన్నాయని, వీరభద్రస్వామి దేవాలయం, రెడ్డెమ్మ తల్లి దేవాలయం వంటి ఎన్నో దేవాలయాలు ఉండడం వల్ల టెంపుల్ టూరిజంకు కూడా మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. గుర్రంకొండ కోట వంటి చారిత్రక కట్టడాలు ఉండడం వల్ల హెరిటేజ్ టూరిజానికి కూడా మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను అడ్వెంచర్ టూరిజం హబ్‌గా అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవా లని, దీనికి సంబంధించిన పూర్తి స్థాయి ప్రాజెక్టు నివేదికను సమర్పించాలని జిల్లా పర్యాటక శాఖాధికారిని ఆదేశించారు. జిల్లాలో వివిధ ప్రాంతాలను కలుపుతూ పర్యాటక సర్క్యూట్‌ను అభివృద్ధి చేసేలా చర్యలు తీసు కోవాలని, ఫుడ్ ఫెస్టివల్ లాంటి కార్యక్రమాలు నిర్వహించి ఎక్కువ మంది పర్యాటకులు జిల్లాకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్, మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, పర్యాటకశాఖ ఆర్‌డీ రమణ ప్రసాద్, జిల్లా పర్యాటక కౌన్సిల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

వరద బాధితులకు రూ.65 లక్షల విరాళం

రైల్వేకోడూరు, అక్టోబరు 29:(ఆంధ్రజ్యోతి): వరద బాధితుల సహాయార్థం రూ.65 లక్షల చెక్కును ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు పాఠశాలల తరపున సోమవారం సాయంత్రం విజయవాడలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు అందజేశామని రైల్వేకోడూరు విక్టరీ స్కూలు అధినేత, ప్రైవేటు స్కూళ్ల రాష్ట్ర ఉపాధ్యక్షుడు విక్టరీ నరసింహారెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాపరమైన అంశాలను ముఖ్యమంత్రితో చర్చించామన్నారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ప్రభుత్వానికి ప్రైవేటు స్కూళ్ల తరపున తమవంతు సాయం అందించడానికి సిద్ధంగా ఉంటామని తెలిపారు.


సీఎం చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న ప్రైవేటు స్కూళ్ల సంఘం నాయకులు

నీరున్నా.. కరువే..


నిండుకుండను తలపిస్తున్న కందుకూరు వ్యాసరాయ సముద్రం

- పేరు పెద్ద.. ఊరు తిప్ప..
- ప్రధాన చెరువులున్నా నీటి జాడేదీ...?
- చెరువుల కింద భూములన్నీ బీళ్లే...

పెద్దతిప్పసముద్రం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే ప్రధాన చెరువులుగా ప్రఖ్యాతి గాంచిన చెరువుల్లో కందుకూరు వ్యాసరాయ, పెద్దతిప్పసముద్రం తిప్పరాయ, రంగసముద్రం రంగరాయ చెరువులు అతి పెద్ద చెరువులుగా గుర్తింపబడ్డాయి. శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మించిన ఈ చెరువుల్లో పెద్దతిప్పసముద్రం మండలానికి జిల్లాలోనే ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చింది. వీటిల్లో నీరు ఉంటే రైతులు ఏడాదికి మూడు పంటలు పండించుకునేవారు. అయితే నేడు ప్రధాన చెరువులైన ఈ మూడు చెరువులు నిండినా పంటలు పండించుకునే ఆస్కారమే లేకుండా పోయింది.

కందుకూరు పాపాఘ్నిపై వ్యాసరాయ చెరువు

కందుకూరు శివార్లలో పాపాఘ్ని నది ఒడ్డున నిర్మించిన చెరువే వ్యాసరాయ సముద్రం (కందుకూరు) చెరువు ఈ చెరువు కింద గ్రామంలోని పట్టెంవాండ్లపల్లె, కందుకూరు, కాట్నగల్లు గ్రామాల్లోని ఆయకట్టు భూములకు నీరు అందుతుంది. కందుకూరు వ్యాసరాయ సముద్రం చెరువు 369.8 ఎంసీఎఫ్‌టీ సామర్థ్యం (ఒక్క ఎంసీఎఫ్‌టి 10 లక్షల ఘనపుటడుగులకు సమానం) ఈ చెరువు నుంచి కిందకు వెళ్లిన నీటితో సత్యసాయి జిల్లా తనకల్లు మండల పరిధిలో వందలాది ఎకరాలు సాగవుతాయి. ఈ చెరువు కింద కాలువలకు మెయింటెనెన్స్ లేకపోవడంతో ఆయకట్టు భూముల్లో పెరిగిన కంపచెట్లు అడవులను తలపిస్తున్నాయి. గత ఏడాదిలో కురిసిన భారీ వర్షాలకు కందుకూరు వ్యాసరాయ సముద్రం చెరువు నిండి మొరవపోయింది. అప్పట్లో మదనపల్లె సబ్ కలెక్టర్‌తో పాటు నీటి పారుదల శాఖ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖాధికారులు ప్రమాదకరంగా ఉన్న చెరువును పరిశీలించి అప్పటి వాస్తవ పరిస్థితులను ప్రభుత్వానికి నివేదించారు. కాగా ఈ మరమ్మతు పనులకు నిధులు విడుదల చేయకపోవడంతో భవిష్యత్తులో కందుకూరు వ్యాసరాయ సముద్రం (కందుకూరు) చెరువుకు ప్రమాదం పొంచి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ చెరువు కింద సుమారు 1600 ఎకరాల ఆయకట్టు భూమిలో పంటలను సాగు చేసుకునే వీలుంది.

పెద్దతిప్పసముద్రం చెరువు

పెద్దేరువంకపై ఉన్న ఈ చెరువు 393.5 ఎంసీఎఫ్‌టీతో నిర్మాణం జరిగింది. ఈ చెరువు కింద 1765 ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. గతంలో ఈ చెరువు పూర్తి స్థాయిలో నిండితే మూడు పంటలు పండించి రైతులు వ్యవసాయం చేసుకునే వారు. అయితే ఈ చెరువు కింద పంట కాలువల్లో హంద్రీ-నీవా కాలువల కోసం ఆయకట్టు భూముల్లో కాలువలు తవ్వడంతో బూర్లపల్లె పంచాయతీ కొత్తపల్లె వైపు నీరు వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. తద్వారా సుమారు 200 ఎకరాల ఆయకట్టు భూములకు నీరు వెళ్లే అవకాశం లేకుండా పోయింది. రెండు మూడేళ్ల కాలంలో ప్రధాన చెరువులు నిండి మొరవలు పోయాయి. అయితే పంటలు సాగు చేసుకునేందుకు కాలువలు లేకపోవడంతో చెరువుల కింద సాగుకు నోచుకోలేదు. అధికారులు తగిన చర్యలు తీసుకుని కాలువల ఆక్రమణలు తొలగించి, పూడికలు తీయించాలని రైతులు కోరుతున్నారు.

రంగసముద్రం రంగరాయ చెరువు

రంగసముద్రం రంగరాయ చెరువు కింద సుమారు 1500 ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. ఈ చెరువుకు గత ప్రభుత్వ హయాంలో కృష్ణాజలాలతో హంద్రీనీవా ద్వారా చెరువు నింపి ఆయకట్టుదారులకు సాగుకు అనుకూలం చేయాలనే ప్రతిపాదన ఉన్నా అధికారులు ఈ చెరువుపై దృష్టి సారించకపోవడంతో పూర్తిగా కంప చెట్లతో మూసుకు పోయి చెరువులో ఉన్న నీరు ఎందుకూ పనికి రాకుండా పోయాయి. అందులోనూ చెరువుల కట్టలు, తూములు శిథిలావస్థకు చేరి తూముల్లో నీరులీకై నీరు వృథాగా దిగువ ప్రాంతాలకు వెళ్లిపోతున్నాయి. కనీసం ఇప్పటికైనా ఇరిగేషన్ శాఖాధికారులు తూములకు మరమ్మతులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



కంపచెట్లతో దర్శనమిస్తున్న పెద్దచెరువు ఆయకట్టు భూములు (ఫైల్ ఫొటో)

సాగునీటి సంఘాలు ఏర్పాటు చేయండి

పై మూడు ప్రధాన చెరువులకు సాగునీటి సంఘాలు నామమాత్రంగా ఉన్నాయి. కనీసం కూటమి ప్రభుత్వమైనా ఈ ప్రధాన చెరువులకు సాగునీటి సంఘాలను నిర్వహించి నిధులను కేటాయిస్తే ప్రమాదకరంగా ఉన్న చెరువు కట్టలు, అలుగులు, సాగునీటి కాలువలకు మరమ్మతులు చేసే అవకాశం ఉంది.

ముళ్లకంపలను తొలగించండి

- గుర్రాల మహబూబ్‌బాష, కందుకూరు



కందుకూరు చెరువు కింద నాకు మూడు ఎకరాల భూమి ఉంది. ఏడెనిమిది సంవత్సరాలుగా భూమిని సాగు చేయకపోవడంతో ఆయకట్టు భూముల్లో ముళ్ల కంపలు పడి అడవులను తలపిస్తున్నాయి. మా కందుకూరు చెరువు ఒక్కసారి నిండితే గతంలో రెండు మూడు పంటలు సాగు చేసుకునే వాళ్లం. కనీసం ఈ ప్రభుత్వంలోనైనా ఉపాధి హామీ పథకం ద్వారా ఆయకట్టు భూముల్లో ఉన్న కంపచెట్లను తొలగిస్తే సాగు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది.

మరమ్మతులు చేపట్టండి

- సుబ్రమణ్యం, ఆయకట్టు రైతు, పెద్దతిప్పసముద్రం

గతంలో చెరువులు పూర్తి స్థాయిలో నిండితే రైతులు రెండు మూడు పంటలను సాగు చేసుకునేవారు. చెరువు కింద ఆయకట్టు భూముల్లో కంపచెట్లు మొలవడం, తూములు పూర్తి స్థాయిలో మరమ్మతులకు గురికావడంతో తూముల్లో నీరు వృథాగా దిగువ ప్రాంతాలకు వెళ్లిపోతున్నాయి. ఈ తూములు, కాలువలు మరమ్మతులు చేయండి.

చెరువుల భూములను కాపాడండి

-కొట్టిరాజు, రైతు, పెద్దతిప్పసముద్రం

మండలంలో ప్రధాన చెరువులైన కందుకూరు, పెద్దతిప్పసముద్రం, రంగసముద్రం చెరువులలో భూములు కబ్జాలు చేశారు. ఈ చెరువుల భూములను రెవెన్యూ అధికారులు పరిశీలించి కాపాడాలి. చెరువుల భూములను కబ్జా చేయకుండా ప్రత్యేక కమిటీని నియమించాలి. చెరువుల్లో అక్రమంగా పంటలు సాగు చేస్తున్నా రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

ప్రతిరోజు 100 మందికి డయాలసిస్

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): రాయచోటి ఏరియా ఆసుపత్రిలో ఇక ప్రతి రోజూ 100 మందికి డయాలసిస్ చేయనున్నారని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం రాయచోటి ఏరియా ఆసుపత్రిలో నూతన డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో డయాలసిస్ బాధితుల సమస్యలు దృష్టిలో ఉంచుకుని రాయచోటి ఏరియా ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించామన్నారు. గతంలో ఇక్కడ 60 మందికి మాత్రమే డయాలసిస్ చేసే సామర్థ్యం ఉండేదని, దీనిని 100కు పెంచామన్నారు. ప్రభుత్వం వైద్యాభివృద్ధికి అధిక నిధులు ఖర్చు చేస్తూ పేదల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి చాలావరకు పేదవాళ్లు వస్తుంటారని వారిని ఆప్యాయతతో పలకరించి వైద్య సేవలందించాలన్నారు. ఈ సందర్భంగా ప్రతిరోజు ఆసుపత్రికి ఎంతమంది రోగులు వస్తున్నారు, రోజుకు ఎన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు, అత్యవసర సమయాల్లో ఎవరెవరు పనిచేస్తున్నారు, వైద్య పరికరాల కొరత ఏమైనా ఉందా తదితర అంశాలపై వైద్య సిబ్బందిని మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డాక్టర్ కొండయ్య, ఆసుపత్రి సూపరింటెండెంట్ డేవిడ్ సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

బాలుర విజేత కడప జట్టు ● బాలికల విజేత చిత్తూరు జట్టు


అండర్-17 కబడ్డీ బాలుర విభాగంలో రాష్ట్రస్థాయి విజేతగా నిలిచిన కడప జట్టు

8



ఆదిమానవుడు చిత్రీకరించిన రేఖాచిత్రాలు

అపురూపాలు ఆదిమానవుడి రేఖాచిత్రాలు



25వేల ఏళ్ల నాటి ఆదిమానవుని ఆనవాళ్లు ● చింతకుంట కొండలో పెరుగుతున్న సందర్శకుల సందడి

రక్షణ కల్పించలేని పర్యాటక, పురావస్తు శాఖలు ● రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు దృష్టి పెట్టాలంటున్న పర్యాటకులు


ముద్దనూరు అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): ఎంతో అరుదైన, అపురూపమైన ఆదిమానవుడు రేఖా చిత్రాలు చింతకుంట కొండలో కనువిందు చేస్తున్నాయి. 25 వేల ఏళ్ల కిందట ఇక్కడ మానవులు ఆవాసం ఏర్పరచుకున్నారని, జీవించారని, కొండపై చిత్రించిన రేఖా చిత్రాలు ఆధార భూతమై నిలుస్తున్నాయి. ఇక్కడి వాతావరణం, నీరు, ఆహారం పుష్కలంగా ఉండడంతో ఆదిమానవుడు ఆవాసానికి అనువైన ప్రదేశంగా ఎంచుకుని నివసించి ఉంటారని దాదాపు 200 రేఖాచిత్రాలను తిలకించిన మేధావులు అభిప్రాయపడుతున్నారు. వీరు ఏర్పాటు చేసుకున్న నివాస ప్రదేశాల ఆచూకీ తెలుసుకునేందుకు అనువుగా అక్కడక్కడా ఎరుపు రంగు ఆకుపసరుతో బాణం గుర్తులను ఏర్పాటు చేసుకున్నారని అంటున్నారు. ఈరేఖా చిత్రాల ఆధారంగా ఆది మానవడు దాదాపు 12 అడుగుల ఎత్తు ఉండవచ్చని, కొండలో ఇంకా గాలిస్తే ఎన్నో ఆనవాళ్లు లభించే అవకాశం వుందని అంటున్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ కనబరిస్తే ఆదిమానవుడి ఆనవాళ్లు మరెన్నో గుర్తించవచ్చు. వివరాల్లోకెళితే....


నాటి చరిత్ర, నేటి యువతరానికి ప్రతీకలు, శతాబ్ధాలు దాటిన ప్రతి ఆనవాళ్లు చరిత్రకు ప్రతీకగా, అపురూపంగా భావించి, వాటి అభివృద్ధి, రక్షణ కోసం పర్యాటక, పురావస్తు శాఖలను ఏర్పాటు చేశారు. కోతి ద ా ్ర ం ా ఆదిమానవుడు రూపాంతరం చెందుతూ నేడు మనిషిగా మనుగడ కొనసాగిస్తున్నాడు. అటు వంటి ఎంతో పురాతన చరిత్ర కలిగిన 25వేల ఏళ్ల నాటి ఆదిమానవుడి ఆనవాళ్లు ఉన్న రేఖాచిత్రాలను, తిలకించేందుకు వచ్చే సందర్శకులకు చింతకుంట కొండలో రక్షణ కరువైందన్న విమర్శలు వస్తున్నాయి.

చింతకుంట పంచాయతీలోని కొండలు ఎంతో ఆహ్లాదకరంగా ఉన్నాయి. కొండపై నెలకొన్న కోనలింగేశ్వరస్వామి(శివాలయం), సమీపంలోనే 1909 బ్రిటీషర్లు ఏర్పాటు చేసిన విశాలమైన జలాశయాన్ని తలపిస్తున్న చింతకుంట చెరువు. ఈప్రదేశంలో నెలకొన్న ప్రతి ఒక్కటీ చరిత్రను సృష్టిస్తున్నాయి. 2010 ఆగస్టు 17న అప్పటి ఎంపీడీఓ మొగిలిచెండు సురేష్, వివేకవర్ధిని జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకులు పుల్లారెడ్డి, కడప ఇన్‌టాక్ లైఫ్‌మెంబర్, అప్పటి జిల్లా కన్వీనర్ సీతారామయ్య, అప్పటి ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా అధికారి సత్యం కొందరు పత్రికా విలేకరుల సహకారంతో ఆది మానవుడి ఆనవాళ్ల కోసం కొండలో గాలించి ఆదిమానవుడి రేఖాచిత్రాలను వెలుగులోకి తెచ్చారు. ఎద్దుల ఆవులగుండు, గొడుగుగుండు, చిన్నావిడగుండు, పెద్దావిడ గుండు, మారెమ్మగుండు, గనంగుండు, మబ్బుగుండు, చిలకలోల్లగుండు ఇంకా ఎన్నో గుండ్ల పై ఆది మానవుడు నాటి నాగరికత, పనిముట్లు, జంతువుల రేఖాచిత్రాలను కొండరాళ్లకు ఆకు పసరుతో నేటి యుగానికి కనువిందు చేసేలా చిత్రించాడు. ఏనుగు, జింక, దుప్పి, నక్క, కుందేలు, పక్షులు, ఎద్దు, విల్లంబులు ఎక్కుపెట్టిన మానవాకృతులు, అప్పటి వేటకు ఉపయోగించే పనిముట్లు, లైంగిక చిత్రాలు, దాదాపు 200 రేఖాచిత్రాలు కనిపిస్తాయి. ఈరేఖాచిత్రాలను తిలకించిన మేధావులు ఆది మానవుడు నివాసానికి అనువైన ప్రదేశంగా ఎంచుకుని ఆవాసం ఏర్పరచుకుని ఉంటారని అంటున్నారు. ఈరేఖా చిత్రాల ఆధారంగా ఆది మానవులు ఎక్కువ సంఖ్యలో ఉండి వుంటారని తెలుస్తోంది. అంతే కాకుండా ఇక్కడ వారి నివాసాలను గుర్తించేందుకు అనువుగా ఎరుపు రంగుతో బాణం గుర్తులను ఏర్పాటు చేసుకున్నారని అంటున్నారు. అంతేకాకుండా వారు మరణిస్తే మృతదేహం పట్టేలా రాతి గుండును మలిచి మృతదేహాన్ని దానిలో పడుకోబెట్టి సీసంతో నింపి అంత్యక్రియలు చేసేవారని వివరిస్తున్నారు. ఈప్రదేశంలో అటువంటి శ్మశానవాటిక ఉండవచ్చని వెదికితే గుర్తించవచ్చని అంటున్నారు. కొండలో గాలిస్తే మరెన్నో ఆనవాళ్లు లభించే అవకాశం వుందని, ఇటువంటి వాటిని గుర్తించి వాటిని భద్రపరిస్తే చరిత్రకు ఆనవాళ్లుగా నిలుస్తాయని అంటున్నారు. రేఖాచిత్రాలు వెలుగు చూసిన తరువాత ఈ ప్రదేశాన్ని ఎందరో సందర్శనార్థం వస్తున్నారు. కొండపైకి వెళ్లాలంటే దారి సరిగాలేక పోవడంతో 2010లో ఉపాధి పథకంలో భాగంగా పర్యాటకుల కోసం అప్పటి ఎంపీడీఓ మొగిలిచెండు సురేష్ గ్రావెల్ రోడ్డును ఏర్పాటు చేయించారు. 2010 ఆగస్టు24న అప్పటి డీపీఆర్‌ఓ ప్రసాద్, యోగివేమన యూనివర్సిటీ ప్రొఫెసర్లు సాంబశివారెడ్డి, రామబ్రహ్మం విద్యార్థులతో కలిసి సందర్శించారు. తరువాత 2011 ఫిబ్రవరి19న అప్పటి డీపీఆర్‌ఓ గోపాల కొండలోని అన్ని గుండ్లకు ఉన్న రేఖా చిత్రాలను సందర్శించారు. అప్పట్లో జమ్మలమడుగు న్యాయమూర్తి, న్యాయవాదులు, ఆర్టీపీపీ ఉద్యోగులు రేఖాచిత్రాలను సందర్శించారు. మనరాష్ట్రం విద్యార్థులే కాకుండా కర్నాటక రాష్ట్రం నుంచి విద్యార్థులు సందర్శనార్థం వస్తూనే వున్నారు. ఆతర్వాత 6వతరగతి సాంఘిక శాస్త్రంలో ఆహార సేకరణ నుంచి ఆహార ఉత్పత్తి వరకు ఆదిమానవుడు పాఠ్యాంశంలో రచయిత, ప్రస్తుతం సంబేపల్లె హెచ్‌ఎం మడితాటి నరసింహారెడ్డి పొందుపరిచారు. దీంతో ఈ ప్రదేశంపై రాష్ట్ర విద్యార్థులు తెలుసుకునే అవకాశం కలిగింది. ఎంతో చరిత్ర కలిగిన ఆదిమానవుడి రేఖాచిత్రాలకు పర్యాటక, పురావస్తు శాఖ వారు రక్షణ కల్పించలేకపోతున్నారు. అప్పట్లో సందర్శనార్థం వచ్చిన కడప అక్షర పాఠశాల విద్యార్థులపై తేనెటీగలు దాడి చేశాయి. అయినా అధికారులు స్పందించక పోవడం గమనార్హం. ఇప్పటికైనా సందర్శకులకు రక్షణ కల్పించ వలసిన అవసరం ఎంతైనా వుంది.









రేఖాచిత్రాల అన్వేషణ కోసం మొదటగా వెళుతున్న ఇన్‌టాక్ సభ్యులు, యోగివేమన ప్రొఫెసర్లు,పర్యాటకశాఖ, అధికారులు, ఎంపీడీఓ - గొడుగు గుండు - మబ్బు గుండులో అప్పటి డీఆర్‌డీఏ పీడీ, పర్యాటకశాఖ గోపాల్, ఎంపీడీఓ మొగిలిచెండు సురేష్

వాల్మీకిపురంలో యువకుడి హత్య

వాల్మీకిపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ కాలనీలో సోమవారం రాత్రి జరిగిన కుటుంబ గొడవలో అజయ్ కత్తితో పొడవడంతో రమేష్(35) అక్కడికక్కడే మృతి చెందాడు. సీఐ ప్రసాద్‌బాబు కథనం మేరకు వివరాల్లోకెళితే...

రమేష్ గుర్కా, కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. తల్లి, తండ్రి తమ్ముడు పిల్లలతో ఉమ్మడిగా కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నారు. రమేష్ నిత్యం మద్యం తాగి ఇంటికి వచ్చి అందరినీ వేధిస్తుండేవాడు. సోమవారం రాత్రి రమేష్ మద్యం తాగి ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులను దుర్భాషలాడుతూ గొడవకు దిగాడు. కుటుంబీకులను దూషిస్తుండడంతో సహించలేక అడ్డుకునేందుకు యత్నించిన రమేష్ అన్న కుమారుడు అజయ్‌పై దాడి చేశాడు. దీంతో అజయ్ కత్తితో పొడవడంతో రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీఐ ప్రసాద్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నిందితుడు అజయ్‌ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ

ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ...!

- రైతులను చూసి పారిపోయిన దుండగులు

గుర్రంకొండ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణానికి సమీప ఓనిలోని ఆంజనేయస్వామి ఆలయంలో దుండగులు చోరీకి యత్నించారు. పొలాలకు నీరు పారించడానికి వచ్చిన రైతులను చూసి దుండగులు పరారైనట్లు తెలిసింది. స్థానికుల కథనం మేరకు పట్టణానికి కూత వేటు దూరంలో ఓనిలో చాలా పురాతనమైన అంజనేయస్వామి ఆలయం ఉంది. కాగా తెల్లవారు ఝామున కొందరు దుండగులు ఆలయం తాళాలను పగలకొట్టి లోపలికి ప్రవేశించి ఆలయం బీరువాను ధ్వంసం చేశారు. అనంతరం స్వామి వారికి ఏర్పాటు చేసిన వెండి మకరతోరణాన్ని ధ్వంసం చేసి గోనె సంచిలో ఉంచారు. హుండీని కూడా పగలకొట్టి అందులోని సొమ్ము చోరీ చేశారు. ఆ సమయంలో రైతులు పొలాల వద్దకు వస్తున్నట్లు గమనించిన దుండగులు చోరీ చేయడానికి తెచ్చిన కత్తి, ఇతర పరికరాలను అక్కడే వదిలి పరారైనట్లు రైతులు చెబుతున్నారు. విషయాన్ని ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు తెలపడంతో ఘటనా స్థలానికి వెళ్లి చోరీ జరిగిన తీరును పరిశీలించారు. నిందితులను కనిపెట్టి తగు చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మధురామచంద్రుడు తెలిపారు.



ధ్వంసం చేసిన బీరువా

భూఆక్రమణదారులపై కేసులు నమోదు

అట్లూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నల్లాయపల్లె భూములను ఆక్రమించబోయిన పలువురిని బైండోవర్ చేసుకున్నట్లు డిప్యూటీ తహసీల్దారు శిరీషా తెలిపారు. బద్వేలు మండలానికి చెందిన ఉదయగిరి సుభాన్‌బాషా, ధర్మశెట్టి వెంకటసుబ్బయ్య మరో 30 మందితో మంగళవారం ప్రభుత్వ భూమి ఆక్రమించేందుకు యత్నించి స్తంభాలు పాతి కంచె వేసేందుకు ప్రయత్నించారు. రెవెన్యూ అధికారులకు సమాచారం తెలియడంతో డిప్యూటీ తహసీల్దారు శిరీషా, అట్లూరు ఎస్ఐ రామకృష్ణ ఆక్రమిత స్థలానికి చేరుకుని ఆక్రమణదారులను అదుపులోకి తీసుకుని వారిని బైండోవర్ చేసినట్లు డిప్యూటీ తహసీల్దారు తెలిపారు. ఎవరైనా నల్లాయపల్లె భూములను ఆక్రమించేందుకు యత్నించినా కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు ఆర్ఐ రమణ, వీఆర్వో సుబ్బయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ఆక్రమణ దారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న రెవెన్యూ, పోలీసు అధికారులు

ఎర్రచందనం స్మగ్లర్లపై ఉక్కుపాదం

ఒంటిమిట్ట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం స్మగ్లర్లను అణచివేస్తామని కడప డీఎఫ్‌ఓ వినీత్‌కుమార్ హెచ్చరించారు. సోమశిల వెనుక జలాలను పరిశీలించిన ఆయన ఫారెస్ట్ పరిధిలో అనుమతి లేకుండా ఎవరూ సంచరించకూడదని, నిషేధిత ప్రాంతంలోకి అనుమతి లేకుండా ఎవరు వెళ్లినా చర్యలు తీసుకుంటామన్నారు. వన్య ప్రాణులకు తాగునీటి కల్పనపై అధికారులకు సూచనలిచ్చారు. అభివృద్ధి పనులను అవినీతికి తావులేకుండా చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజర్ ప్రణీతి, ఎఫ్ఎస్ఓ బ్రహ్మయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వెనుకజలాలను పరిశీలిస్తున్న డీఎఫ్ఓ

అట్టహాసంగా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

● రాష్ట్ర స్థాయిలో బాలుర విజేత కడప ● బాలికల విజేత చిత్తూరు జట్టు





అండర్-17 కబడ్డీ బాలికల విభాగంలో రాష్ట్ర స్థాయి విజేతగా నిలిచిన చిత్తూరు జట్టు - హాజరైన వివిధ జిల్లాల క్రీడాకారులు

రాయచోటిటౌన్, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పాఠశాల విద్యాశాఖ పర్యవేక్షణలో స్కూల్ గేమ్స్ ఫెడ రేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకు అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో అట్టహాసంగా సాగిన అండర్-17 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు మంగళవారం ముగిశాయి. కబడ్డీపోటీల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం కార్యక్రమానికి హాజరైన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు, టీడీపీ యువనేత డాక్టర్ మండి పల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. తమ సోదరుడు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సహకారంతో పట్టణంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఐపీఈ భానుమూర్తిరాజు మాట్లాడుతూ అండర్-17 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు రాయచోటి ఆతిథ్యం ఇవ్వడం ఆనందంగా ఉంద న్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి వచ్చిన 26 జట్ల బాల బాలికల క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్ర స్థాయికి ఎంపికకావడం సంతోషంగా ఉందన్నారు. డీఈఓ సుబ్రమణ్యం మాట్లాడుతూ విద్యార్థులకు చదు వే కాకుండా క్రీడలు కూడా చాలా అవసరం అన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం ఏర్పడుతుందన్నారు.

అనంతరం బాలుర విభాగంలో మొదటి స్థానంలో నిలిచిన కడప జిల్లా జట్టుకు రూ.25 వేలు, బాలికల విభాగం మొదటి స్థానంలో నిలిచిన చిత్తూరు జిల్లా జట్టుకు రూ.25 వేలు, బాలుర విభాగం రెండో స్థానంలో నిలిచిన అనంతపురం జట్టుకు రూ.15 వేలు, బాలికల విభాగం రెండో స్థానంలో నిలిచిన శ్రీకాకుళం జట్టుకు రూ.15 వేలు, బాలుర విభాగంలో మూడో స్థానంలో నిలిచిన కర్నూలు జట్టుకు రూ.10 వేలు, నాలుగో స్థానంలో నిలిచిన చిత్తూరు జట్టుకు రూ.10 వేలు, బాలికల విభాగంలో మూడో స్థానంలో నిలిచిన అనం తపురం జిల్లా జట్టుకు రూ.10 వేలు, కృష్ణా జిల్లా జట్టుకు రూ.10 వేలు చొప్పున నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేసి అభినం దించారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ సెక్రటరీలు వసంత, అరుణ కుమారి, కబడ్డీ పోటీల ఆర్గనైజింగ్ సెక్రటరీ వీరాంజనేయులు, ఉపాధ్యాయ సంఘం చీఫ్ పాటర్న్ నరసరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర జట్టుకు ఎంపికైన బాలబాలికలు వీరే

అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో మూడు రోజులు పాటు జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి జట్లకు బాలబాలికలను ఎంపిక చేశారు. ఈ జట్లు మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాయి.

బాలుర జట్టు: నూర్‌బాషా, బ్రహ్మయ్య, మద్దిలేటి స్వామి (కడప), విష్ణు (అనంతపురం), ఎస్ఎస్‌జాన్ పీటర్ (చిత్తూరు), బటీ గుర్రప్ప (కర్నూల్), రామకృష్ణ (ప్రకాశం), పవన్‌కల్యాణ్ రెడ్డి(గుంటూరు), బీహెచ్ తీషిత్ (కృష్ణ), గంగరాజు (విజయనగరం), సోమేశ్ (ప్రకాశం), దామోదర్‌నాయుడు (కడప), లీలాధర్ (కర్నూలు), సందీప్ (చిత్తూరు).

బాలికల జట్టు: లిఖిత, సనా (చిత్తూరు), యమున (శ్రీకాకుళం), అర్చన (శ్రీకాకుళం), హిమజ, నవ్య(అనంతపురం), కీర్తన (కృష్ణ), శిరీష (కర్నూలు), దేవికాబాయి (గుంటూరు), లక్ష్మీదేవి (విజయనగరం), దివ్య(విశాఖపట్నం), రెడ్డికావ్యశ్రీ (కడప), త్రిపుర (ప్రకాశం), జ్యోతి (కృష్ణ), పల్లవి (చిత్తూరు).

బి.కొత్తకోటలో రెండు గంటలు హైరానా

కుటుంబ సమస్యలతో వాటర్‌ట్యాంక్ ఎక్కిన కార్మికుడు ● ప్రాణాలు కాపాడిన అగ్నిమాపక సిబ్బంది

బి.కొత్తకోట, అక్టోబరు(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుడు పోలీసులు, ప్రజలను రెండు గంటలపాటు హైరానా పట్టించాడు. స్థానిక ఎస్సీ కాలనీ వాసి కార్మికుడు కోగర శ్రీనివాసులు సాయంత్రం జ్యోతిసర్కిల్‌లో ఉన్న 60 అడుగుల ఎత్తైన వాటర్ ట్యాంకును ఎక్కాడు. ట్యాంక్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకోబోతున్నానని పలువురికి ఫోన్ చేశాడు. విషయం తెలియడంతో శ్రీనివాసులు భార్య శిరీష, ముగ్గురు పిల్లలు, సీఐ రాజారెడ్డి, సిబ్బంది ట్యాంకు వద్దకు చేరుకున్నారు. కానిస్టేబుల్ జబీవుల్లా ట్యాంక్ ఎక్కి దూకకుండా ఆపగలిగారు. విషయం దావానలంలా వ్యాపించడంతో జనం పెద్దసంఖ్యలో గుమిగూడారు. దీంతో సర్కిల్‌లో ట్రాఫిక్ అంతరాయం కలిగింది. సీఐ మదనపల్లె అగ్నిమాపకదళాన్ని పిలిపించి ట్యాంకునీటిలో దిగిన కార్మికుడిని వలలో బంధించి ఫైర్‌సిబ్బంది కిందికి దింపారు. పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా శ్రీనివాసులుకు వెన్నెముక ఆపరేషన్ జరగడంతో పనులు చేయలేక పోతున్నాడని, భార్య తో సఖ్యతలేక పోవడంతో జీవితంపై విరక్తి చెందాడని, మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తే జీతం పెండింగ్‌లో పెట్టారని శ్రీనివాసులు చెప్పి నట్లు సీఐ తెలిపారు. భార్యాభర్తలకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.



జ్యోతిసర్కిల్‌లో గుమికూడిన జనం



ట్యాంకు నుంచి వలలో కిందికి దింపుతున్న అగ్నిమాపక సిబ్బంది

సీబీఐ డీఐజీగా వెంకటసుబ్బారెడ్డి

ఎర్రగుంట్ల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సీబీఐ డీఐజీగా చిన్నకొండు వెంకటసుబ్బారెడ్డి నియమితులయ్యారు. ఎర్రగుంట్ల మండలం హనుమనగుత్తి గ్రామానికి చెందిన ఐపీఎస్ అధికారి చిన్నకొండు వెంకటసుబ్బారెడ్డి 2007 అస్సాం-మేఘాలయ క్యాడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి. అప్పట్లో ఆయన 126 ర్యాంకు సాధించి ఐపీఎస్‌గా ఎంపికయ్యారు. ప్రస్తుతం మేఘాలయ డీఐజీగా పనిచేస్తున్నారు. సీబీఐ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా వెంకటసుబ్బారెడ్డిని నియమిస్తూ కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు చేసింది. ఈయన ఐదేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారు. సాధారణ మధ్యతరగతి రైతు కుటుంబానికి చెందిన ఈయన కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకున్నారు. అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రస్తుతం సీబీఐ డీఐజీ స్థాయికి చేరుకున్నారు. వెంకటసుబ్బారెడ్డిని సీబీఐ డీఐజీగా నియమించడంతో తల్లిదండ్రులు వెంకటలక్షుమ్మ, రమణారెడ్డి, గ్రామస్తులు, బంధువులు హర్షం వ్యక్తం చేశారు.



రూ.2.56 లక్షలు వెంటనే చెల్లించాలి



హనీఫ్‌బాషాను విచారిస్తున్న డీఎల్‌పీఓ తిమ్మక్క

చాపాడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కంప్యూటర్ ఆపరేటర్ హనీఫ్‌బాష వాడుకున్న రూ.2.56 లక్షలను 15 రోజుల్లోగా చెల్లించాలని జమ్మలమడుగు డీఎల్‌పీఓ తిమ్మక్క ఆదేశించారు. ఎంపీడీఓ కార్యాలయం కంప్యూటర్ ఆపరేటర్ హనీఫ్‌బాష జనవరి నెలలో భద్రిపల్లె పంచాయతీకి చెందిన రూ.2.56 లక్షలు సర్పంచు, అధికారి అనుమతి లేకుండా వాడుకున్నారు. మంగళవారం భద్రిపల్లెలో విచారించిన ఆమె ఈ డబ్బును ఎందుకు వాడుకున్నావని హనీఫ్‌ను ప్రశ్నించారు. తన భార్యకు చికిత్స కోసం వాడుకున్నానని హనీఫ్‌బాష వివరణ ఇస్తూ తిరిగి చెల్లిస్తానని తెలిపారు. ఈఓపీఆర్‌డీ క్రిష్ణవేణి, సర్పంచ్ మల్లేశ్వరి పాల్గొన్నారు.

పోల్‌వాల్ట్‌లో చరణ్‌కు గోల్డ్‌మెడల్

దువ్వూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పుల్లారెడ్డిపేట డిగ్రీ కాలేజీ విద్యార్థి ఎస్.చరణ్ పోల్‌వాల్ట్ ఈవెంట్‌లో ప్రథమస్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించినట్లు కళాశాల వ్యాయామ అధ్యాపకులు కె.కన్నయ్య తెలిపారు. కర్నూలులో జరిగిన ఈ పోటీలో విద్యార్థి ప్రతిభను కొనియాడుతూ కాలేజీ కరస్పాండెంట్ ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి అతనిని అభినందించినట్లు చెప్పారు.

ప్రభుత్వాస్పత్రిలో మందులు చోరీ

మదనపల్లె టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మదనపల్లె సర్వజన బోధనాస్పత్రిలో మందుల చోరీ విషయం మంగళవారం రాత్రి వెలుగులోకి వచ్చింది. సర్వజన బోధనాస్పత్రిలో ఓ సెక్యూరిటీ మహిళా గార్డు విధుల నుంచి దిగి వెళ్లే సమయంలో ఆమె బ్యాగులో కొన్ని మందులు, సెలైన్ బాటిళ్లు వుండడాన్ని కొందరు వీడియో తీసి వైరల్ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజుకు కొందరు ఫిర్యాదు చేశారు. సెక్యూరిటీ గార్డును విచారించి ఆస్పతిలో ఉండాల్సిన మందులు గార్డు బ్యాగులో ఉండడంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

మూడు ఆలయాల్లో చోరీ

మదనపల్లె అర్బన్, అకోటబరు29:(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం, టీకేపల్లెలోని మూడు ఆలయాల్లో దొంగలు చోరీ చేశారు. కనకదాస్‌నగర్ పాలేటమ్మ ఆలయం, ఇదే ప్రాంతంలోని వరసిద్ధి వినాయక స్వామి ఆలయం, జాతీయరహదారి ఆనుకుని ఉన్న వరాల గంగమ్మ ఆలయంలో దొంగలు హుండీలను దోచుకెళ్లారు. స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ మేరకు టూటౌన్ పోలీసులు విచారణ చేపట్టారు.

మైలవరానికి 12000 క్యూసెక్కులు విడుదల

అవుకు నుంచి ఇన్‌ఫ్లో 12000 క్యూసెక్కులు

కొండాపురం, అక్టోబరు 29 (ఆంధ్ర జ్యోతి): గండికోట నుంచి మైలవరానికి మంగళవారం 12000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. కాగా ప్రాజెక్టులోకి అవుకు రిజర్వాయిర్ నుంచి జీఎన్ఎస్ఎస్ వరద కాల్వ ద్వారా 12000 క్యూసెక్కుల కృష్ణాజలాలు వచ్చి చేరుతున్నట్లు డీఈ తెలిపారు. మెయిన్ కెనాల్‌కు 75 క్యూసెక్కులు వదులుతున్నామని, గండికోటలో 26 టీఎంసీల నీరు ఉన్నట్లు డీఈ తెలిపారు.

కన్నేశారు.. అమ్మేశారు..!

- 2140 సర్వే నెంబరులో రూ.లక్షల విలువ చేసే స్థలం కబ్జా
- జగనన్న కాలనీ పేరిట అక్రమ పట్టాలు
- వైసీపీ నాయకులు, సానుభూతిపరులకు కట్టబెట్టిన నేతలు
- ప్రభుత్వం మారినా ఆగని అక్రమ కట్టడాలు


2140 సర్వే నెంబరులో అక్రమ కట్టడాలు

సుండుపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లు ప్రభుత్వ స్థలాలను వైసీపీ నాయకులు కొందరు తమ అనుచరులకు అప్పనంగా అప్పజెప్పారు. ఐదు సంవత్సరాలు ప్రభుత్వ భూములే లక్ష్యంగా అమ్ముకున్న సంఘటనలు ఒక్కొక్కటి వెలుగు చూస్తున్నాయి. ఒకటా, రెండా మండల కేంద్రంలో వాగులు, వంకలు, గుట్టలు, చెరువులను వదలకుండా అమ్ముకుని అక్రమాలకు తెరలేపారు. ప్రభుత్వ స్థలం ఉందని తెలిస్తే చాలు ఐదు సంవత్సరాలుగా వైసీపీ నాయకులు వాటిని కబ్జా చేసి కోట్లు కొల్లగొట్టారు. సుండుపల్లి మండల ప్రజల అవసరాల కోసం మంచినీటిని శుద్ధి చేసి ప్రజలకు అందించేందుకు 2017 టీడీపీ ప్రభుత్వంలో కేటాయించిన స్థలాన్ని వైసీపీ పాలనలో దర్జాగా అక్రమించి ప్లాట్లు వేసి వైసీపీ నాయకులు అమ్మేశారు. ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం ఏర్పాటు చేసి 2 రూపాయలకే తాగునీరు అందించాలన్న సంకల్పంతో టీడీపీ హయంలో అప్పటి ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి అధికారికంగా ఆగ్రహారం సమీపంలోని పెట్రోల్ బంకు వెనుక భాగంలో శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. తాగునీటి కోసం వేలాది రూపాయలు ఖర్చు చేసి బోరు వేశారు. ఆ స్థలాన్ని వైసీపీ అధికారంలోకి వచ్చాక కబ్జా చేసి పక్కా ప్లాన్ ప్రకారం ప్లాట్ రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు అమ్ముకున్నారు. అంతేకాకుండా అప్పట్లో ఎవ్వరికీ అనుమానం రాకుండా అధికారులను తమకు అనుకూలంగా ఉండే వారిని మండల కేంద్రంలో వీఆర్వోలుగా నియమించుకుని జగన్న కాలనీ పేరుతో 2140 సర్వే నెంబరులో ప్రభుత్వ స్థలాన్ని ప్లాట్లుగా మార్చి అమ్ముకున్నారు. ఆ సర్వే నెంబరులో 1.25 ఎకరాల ప్రభుత్వ స్థలానికి అక్రమ పట్టాలు సృష్టించి లక్షల రూపాయలు దండుకున్నారు. ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం ఏర్పాటు కోరకు వేసిన శిలా ఫలకాన్ని మాయం చేశారు. అదే ప్రదేశంలో ఇప్పుడు ఇంటి నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇదంతా తెలిసినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. జగనన్న కాలనీ పేరిట దొంగ పట్టాలు సృష్టించి అమ్మకాలు చేశారు. 2140 సర్వే నెంబరులో ఎటువంటి పట్టాలు ఇవ్వలేదని అధికారులు చెబుతున్నారు కానీ అక్కడ ప్లాట్లు వేసి అమ్మి నిర్మాణాలు చేపడుతున్నా ఎటువంటి చర్యలు మాత్రం తీసుకోలేదు. అప్పటి తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, సర్వేయరు అక్కడ జగనన్న కాలనీ ఏర్పాటు చేయలేదని, పట్టాలు ఇవ్వలేదని రాత పూర్వకంగా సమాచార హక్కు చట్టంలో కోరిన వారికి ఇచ్చారు. కానీ ఆ సర్వే నెంబరులో కొంతమంది వైసీపీ నాయకులు ప్లాట్లు వేసి దర్జాగా అమ్ముకుని లక్షలాది రూపాయలు సంపాదించుకున్నారు. అక్కడ ఇప్పుడు నిర్మాణాలు కూడా జరుగుతున్నాయి. అక్కడ అక్రమ నిర్మాణాలు తొలగించి ఆ స్థలాన్ని ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి వినియోగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

విచారించి చర్యలు తీసుకుంటాం..

అక్రమ నిర్మాణాలపై విచారించి చర్యలు తీసుకుంటాము. 2140 సర్వే నెంబరులో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్లు సమాచారం లేదు. ఆంధ్రజ్యోతి వివరణ అడగడంతో తెలిసింది. ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం శిలాఫలకం అప్పట్లో ఏర్పాటుపై మండల ఆర్‌డబ్ల్యుఎస్ అధికారిని విచారిస్తాము.

- దైవాదీనం, తహసీల్దారు, సుండుపల్లి

అప్పన్నకుంటలో అక్రమ నిర్మాణాలు

మండల కేంద్రంలోని అప్పన్న కుంట (సర్వే నెంబరు 2169లో) చుట్టూ అక్రమ నిర్మాణాలు పుట్టుకొస్తున్నాయి. సుమారు 25 ఎకరాలు ఉన్న కుంట రోజురోజుకు కర్పూరంలా కరిగిపోతోంది. పెద్ద పెద్ద భవనాలు కడుతున్నా రెవెన్యూ అధికారులు అది ప్రభుత్వ భూమి కాదని అనుకుంటున్నారేమో.. ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఫిర్యాదుదారులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత నిర్లక్ష్యంగా ఉండడం వెనుక మతలబు ఏమిటో అర్థం కావడం లేదు. అప్పన్నకుంటను, ప్రభుత్వ స్థలాలకు రక్షణ కల్పిస్తారని అనుకుంటే వచ్చిన రెవెన్యూ సిబ్బంది మౌనంపై కూటమి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.

అక్రమ పట్టాలపై విచారణ ఎక్కడ

మండల కేంద్రంలో వైసీపీ అధికారంలో ఉన్నపుడు పదుల సంఖ్యలో అక్రమ పట్టాలు పుట్టుకొచ్చాయి. అవీనితి అధికారుల చేతివాటం, అప్పటి పాలకుల నియంత పాలనకు నిదర్శనంగా దొంగ పట్టాలు సృష్టించారు. వందలాది పట్టాలు పుట్టించి అక్రమ నిర్మాణాలకు తెరలేపారు. అందులో మండల కేంద్రంలో పనిచేసిన వీఆర్వోలు పైఅధికారుల హస్తం ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విచారణ నిర్వహిస్తామని చెప్పిన మాటలు నీటిపై రాతల్లా మారిపోయాయని అందరూ మాట్లాడుకుంటున్నారు. ఆ మాటలను నిజం చేసే విధంగా రెవెన్యూ అధికారుల తీరు ఉందని స్పష్టంగా తెలుస్తోంది. అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని కూటమి నేతలు ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవడం ఏమిటో అని ప్రజలు చర్చించుకుంటున్నారు.


2140 సర్వే నెంబరులో ఎటువంటి లేఅవుట్ వేయలేదని రాతపూర్వకంగా ఇచ్చిన అధికారులు


ఎటువంటి ఇంటి పట్టాలు ప్రభుత్వం ఇవ్వలేదని సమాచార హక్కు చట్టంలో ఇచ్చిన వైనం


అప్పన్నకుంట గట్టుపై నిర్మించిన మరుగుదొడ్లు


అప్పన్న కుంటలో అక్రమ నిర్మాణాలు

'జిల్లాపై అంత కక్ష ఎందుకు?'

వేంపల్లె, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి గారు కడప జిల్లాపై అంత కక్ష ఎందుకు అని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి ఎస్.తులసిరెడ్డి ప్రశ్నించారు. వేంపల్లెలో మంగళవారం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మంత్రివర్గంలో కడప జిల్లాకు ప్రాతినిధ్యం లేదన్నారు. రూ.250కోట్లతో కడపజిల్లా కొప్పర్తి పారిశ్రామిక వాడకు సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల సాంకేతిక శిక్షణ కేంద్రాన్ని మంజూరు చేసిందన్నారు. సెప్టెంబరు 24న చంద్రబాబు ప్రభుత్వం ఈ కేంద్రాన్ని కొప్పర్తి నుంచి అమరావతికి మారుస్తూ జీఓ జారీ చేసిందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం కడప జిల్లాకు, రాయలసీమకు అన్యాయం చేస్తోందన్నారు.

తానా సదస్సుకు శివారెడ్డి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) నెలనెలా తెలుగు వెలుగు కార్యక్రమంలో భాగంగా ప్రాంతీయ మాండలిక భాష సాహిత్యాల అస్తిత్వం శీర్షికతో నవంబరు 24న జరగనున్న అంతర్జాతీయ అంతర్జాల సదస్సుకు సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డికి ఆహ్వానం అందింది. సదస్సులో రాయలసీమ యాసపై ఆయన ప్రసంగించనున్నారు. కార్యక్రమాన్ని తానా పూర్వ అధ్యక్షుడు డాక్టర్ తోటకూర ప్రసాద్ నిర్వహించనున్నారు. శివారెడ్డిని వైవీయూ వీసీ ప్రొఫెసరు క్రిష్ణా రెడ్డి, ఇన్‌చార్జ్ రిజిస్ట్రారు ప్రొఫెసరు పద్మ అభినందించారు.

2న చిత్రలేఖన పోటీలు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నవంబరు 2న చిత్ర లేఖన పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా బాలోత్సవం అధ్యక్షుడు గోపాల్, నాయకులు బి.లక్ష్మిరాజా, నాగమునిరెడ్డి, ఏలేశ్వర్ రావు తెలిపారు. మంగళవారం కడప యూటీఎఫ్ భవన్‌లో జిల్లా బాలోత్సవ సమావేశంలో వారు మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఉమ్మడి జిల్లాలో పులివెందుల, ప్రొద్దుటూరు, బద్వేలు, రాయచోటిలో చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

వైవీయూ పీఆర్ సెల్ సంచాలకులుగా డాక్టర్ సరిత


డాక్టర్ సరిత, ప్రొఫెసరు కాత్యాయనికి నియామకపత్రాలు అందిస్తున్న వైస్‌చాన్సలర్ కె.క్రిష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వైవీయూ పబ్లిక్ రిలేషన్ సెల్ డైరెక్టరుగా పద్మ సరితను నియమించారు. ఈమేరకు వైస్ చాన్సలర్ ప్రొఫెసరు కె.క్రిష్ణారెడ్డి తన చాంబర్‌లో ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ప్రొఫెసరు పద్మ సరితకు నియామకపత్రం అందించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంటు అసోసియేట్ ప్రొఫెసరుగా సరిత పనిచేస్తున్నారు. ఎన్ఎస్ఎస్ పీవోగా పలు సెల్‌లకు సమన్వయ కర్తగా శాఖాధిపతిగా పనిచేశారు. పరిశోధనల్లో పేటెంట్ కూడా పొందారు. పరిపాలన అనుభవం దృష్ట్యా డైరెక్టరుగా సరితను నియమించారు.

వైవీయూ అప్లైడ్ మేథమేటిక్ విభాగం ప్రొఫెసరు జి.కాత్యాయనిని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. వైస్ చాన్సలర్ ప్రొఫెసరు కె.క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రారు ప్రొఫెసరు పద్మ ఆమెకు నియామకపత్రం అందించారు. ఇదివరకు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ప్రొఫెసరు పద్మను బాధ్యతల నుంచి తప్పించారు.

సోరియాసిస్‌పై అవగాహన సదస్సు


అవగాహన కార్యక్రమంలో ఆసుపత్రి ఉన్నతాధికారులు

కడప సెవెన్‌రోడ్స్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ సోరియాసిస్ దినోత్సవ సందర్భంగా మంగళవారం కడప సర్వజన ఆసుపత్రి రిమ్స్ చర్మవ్యాధుల విభాగంలో రోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డెర్మటాలజీ హెచ్‌వోడీ డాక్టర్ పెంచలయ్య మాట్లాడుతూ ప్రారంభ దశలోనే సోరియాసిస్ వ్యాధికి చికిత్స చేయించుకోవాలన్నారు. ఫువాథెరపీ వంటి ఖరీదైన చికిత్సలు అందుబాటులోకి తెచ్చిన రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, డిప్యూటీ సూపరింటెండెంట్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ ఫువాథెరపీ సదుపాయం ఈ ప్రాంతంలోని రోగులకు ఎంతో ఉపయోగకరమన్నారు. కడప వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ్ మాట్లాడుతూ సోరియాసిస్ మాత్రమే కాకుండా బొల్లిలాంటి అనేక చర్మవ్యాధులకు ఎటువంటి దుష్పరిణామాలు లేని చికిత్స చేయవచ్చని తెలిపారు. సోరియాసిస్ దీర్ఘకాలిక వ్యాధి అని.. వైద్యుల పర్యవేక్షణలో చికిత్స చేయించుకోవాలన్నారు. చర్మవ్యాధుల విభాగం వైద్య అధ్యాపకులు, పీజీ విద్యార్థులు, నర్సింగ్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు

శిక్షణ ద్వారా యువత ఉపాధి పొందాలి

- జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్


జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్‌తో కెనరా బ్యాంకు ఆర్‌ఎం, డీఆర్డీఏ అధికారుల బృందం

కడప కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యువతకు ఆయా రంగాల్లో మంచి శిక్షణ ద్వారా వారి ఉపాధి మెరుగపరిచాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబరులో కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్, కెనరా బ్యాంకు ఆర్‌ఎం మురళీ మోహన్‌లు జిల్లాస్థాయి ఆర్సేటీ అడ్వైజరీ కమిటీ సమాశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ కమిటీ ఉద్దేశ్యాలపై రివ్యూ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆరు నెలల్లో ఎన్ని శిక్షణా కార్యక్రమాలు చేశారని, ఎంత మందికి ఉపాధి దొరికిందని అడిగి తెలుసుకున్నారు. నిరుద్యోగ యువతను సమీకరించి.. వారికి శిక్షణ ఇవ్వడం పట్ల కలెక్టర్ అభినందించారు. నవంబరు 20వ తేదీ నుంచి మహిళలకు దుస్తుల తయారీ, ఉమెన్స్ టైలర్, బ్యూటీ పార్లర్ మేనేజ్మెంట్, ఎంబ్రాయిడరీ, జూట్ బ్యాగుల తయారీని కడప కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఇక్కడ జరిగే అన్ని కార్యక్రమాలకు ట్రెనింగ్ మెటీరీయల్, వసతి, భోజన సదుపాయాలు పూర్తిగా ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు.

ఈకార్యక్రమాలను అన్నమయ్య, కడప జిల్లా నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం జనార్ధన్ డీఆర్డీఏ పీడీ ఆనంద్‌నాయక్, నాబార్డు డీడీఎం విజ య్ విహారి, డీఐసీజీఎం చాంద్‌బాషా, ఆర్సీ టీ డైరెక్టర్ ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి


మృతి చెందిన రాజశేఖర్

కమలాపురం రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నల్లింగాయపల్లె గ్రామం వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజశేఖర్ (56) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా.. తీవ్రంగా గాయపడిన సుబ్బరాయుడు(19) అనే యువకుడిని 108లో రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి వివరాల మేరకు.. ప్రొద్దుటూరు మండలం వినాయకనగర్‌కు చెందిన కాటం రాజశేఖర్ అనే వ్యక్తి అగస్త్యలింగాయపల్లెలో తమ బంధువుల పెళ్లికి వచ్చాడు. మలిపెళ్లి అయిపోయిన తరువాత తిరిగి ప్రొద్దుటూరుకు వెళ్లేందుకు రోడ్డుపై నడుచుకుంటూ పోతుండగా భారతి సిమెంటు ఫ్యాక్టరీ సమీ ఎంలోకి రాగానే ముద్దల సుబ్బరాయుడు స్కూటరుపై మరో వ్యక్తిని ఎక్కించుకుని అతివేగంగా వస్తూ.. అదుపు తప్పి రాజశేఖర్‌ను ఢీకొట్టాడు. దీంతో రాజశేఖర్ అక్కడికక్కడే మృతి చెందగా సుబ్బరాయుడుకు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని రిమ్స్‌కు తరలి స్తుండగా మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మత్తు పదార్థాలతో ప్రాణాలకు ముప్పు

- నెహ్రూయువ కేంద్ర జిల్లా యువ అధికారి మణికంఠ



మాట్లాడుతున్న నెహ్రూయువ కేంద్ర జిల్లా యువ అధికారి మణికంఠ

కడప మారుతీనగర్, అక్టోబర్ 29 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల వాడకంతో ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని నెహ్రూయువ కేంద్ర జిల్లా యువ అధికారి కె.మణికంఠ యువతకు సూచించారు. నెహ్రూయువ కేంద్రం, జేబీవీఎస్ ది ఫిరజర్వేర్ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఉక్కాయపల్లె నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో మాదక ద్రవ్యాలు యువతని ఏ విధంగా ప్రభావితం చేస్తున్నాయి అనే అంశంపై యువతీ, యువకులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలకు సంబంధించి ప్రత్యేక సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. యువత ఎక్కువగా మాదక ద్రవ్యాలకు అలవాటుపడి, అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్నారు. మత్తులో వున్న యువకులు ఇతరులతో అసభ్య ప్రవర్తనతో పాటు దొంగతనాలకు కూడా పాల్పడుతూ సమాజం ఛీ కొట్టేలా ప్రవర్తిస్తున్నతీరు సరికాదన్నారు. మొదట సరదాగా మొదలయ్యే మాదకద్రవ్యాల వాడకం క్రమక్రమంగా పెరుగుతుందన్నారు. దీంతో బానిసలకు మారి అఘాయిత్యాలకు పాల్పడడం జరగుతున్నదన్నారు. కావున ఇప్పటికైనా యువత మాదక ద్రవ్యాల వాడడంపై సరైన అవగాహనతో మెలగి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో రిమ్స్ సైక్రియాట్రిస్ట్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరాముడు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ శ్రీధర్, సమితి వ్యవస్థాపకులు అశోక్, మదర్ థెరిసా ఫౌండేషన్ చైర్మన్ విజయ్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన రోడ్డు ప్రమాదం

- బాంబ్‌స్క్వాడ్ వాహనాన్ని ఢీకొన్న ఇసుక ట్రాక్టర్

వేంపల్లె, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిపల్లె వద్ద మంగళవారం ఉదయం బాంబ్‌స్క్వాడ్ వాహనాన్ని ఇసుక ట్రాక్టర్ ఢీకొంది. దీంతో బాంబ్‌స్క్వాడ్ వాహనం రోడ్డుపక్కనున్న పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాకపోవడంతో అందరు ఊపిరిపీల్చుకున్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల పర్యటన నేపథ్యంలో బాంబ్ స్క్వాడ్ బృందం తనిఖీ చేసుకుంటూ పులివెందులకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

స్వల్ప స్కోర్‌కే చేతులెత్తేసిన గుంటూరు

- భారీస్కోర్ సాధించిన శ్రీకాకుళం, నెల్లూరు జట్లు


ఏసీఏ క్రికెట్ మైదానంలో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

కడప స్పోర్ట్స్, అక్టోబర్ 29 (ఆంధ్రజ్యోతి) : కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-14 ఇంటర్ డిస్ట్రిక్ట్ గ్రూప్-బి మల్టీడే రెండు రోజుల క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా మంగళవారం 152 పరుగుల స్వల్ప స్కోర్‌కే గుటూరు జట్టు ఆలౌట్ అయ్యింది. మరో రెండు వేర్వేరు మ్యాచ్‌లలో శ్రీకాకుళం, నెల్లూరు జట్లు భారీ స్కోర్లు సాధించాయి. వివరాలిలా....

కేఎస్‌ఆర్ఎం మైదానంలో క్రిష్ణా-గుంటూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ నెగ్గిన గుంటూరు జట్టు బ్యాటింగ్‌కు దిగి 63 ఓవర్లలో కేవలం 152 పరుగులకే చేతులెత్తేసింది. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన క్రిష్ణా జట్టు మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 28.3 ఓవర్లలో 1 వికెట్ మాత్రమే కోల్పోయి 80 పరుగులు చేసింది. ఇందులో భానుచంద్‌యాదవ్ 42 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు. ఇంకా 72 పరుగుల వెనుకంజలో క్రిష్ణా జట్టు ఎదురీదుతోంది. అలాగే ఏసీఏ క్రికెట్ మైదానంలో విజయనగరం-శ్రీకాకుళం జట్ల మధ్య మ్యాచ్ సాగింది. టాస్‌నెగ్గిన శ్రీకాకుళం బ్యాటింగ్ చేపట్టి 89 ఓవర్లలో 336 పరుగులు భారీ స్కోర్ సాధించింది. ఇందులో ఎన్.జోగేంద్ర 124 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. కాగా బౌలింగ్ విభాగంలో శ్రీచరణ్ 5 వికెట్లు సాధించడం విశేషం.

కేఓఆర్ఎం మైదానంలో నెల్లూరు-అనంతపురం జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో తొలుత నెల్లూరు జట్టు 60.1 ఓవర్లలో 264 పరుగులు చేసింది. ఇందులో సుశాంత్ 75 పరుగులు చేశాడు. బౌలింగ్ విభాగంలో ఎండీ రోహిత్ 5 వికెట్లు పడగొట్టాడు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి 29 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 108 పరుగులు చేసింది. ఇందులో ఆదినారాయణరెడ్డి 45 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నాడు. కాగా మరో 156 పరుగుల లోటుతో అనంతపురం జట్టు ఎదురీదుతొంది.


జోగేంద్ర (శ్రీకాకుళం) 124 నాటౌట్


5 వికెట్లు తీసిన శ్రీచరణ్ (విజయనగరం)

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

రాయచోటిటౌన్, అక్టోబరు 29 (ఆంధ్ర జ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళ వారం పట్టణం లోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గంలో భూ సమస్యలు అధికంగా ఉన్నాయన్నారు. తాగునీటి సమస్య పరిష్కరించడానికి ఇప్పటికే పలు గ్రామాల్లో బోర్లు వేసి మోటార్లు బిగించామన్నారు. రాబోయే రోజుల్లో రాయ చోటి నియోజకవర్గంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి తమవంతు బాధ్యతగా కృషి చేస్తామన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలన్నారు.

చిన్నమండెం: బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో ఆయన ప్రజా దర్బార్ నిర్వహించారు. జిల్లాలో ఏ ఒక్కరూ సమస్యలతో బాధపడ కూడదనే ఉద్దేశంతో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని భూ సమస్యలపై రెవెన్యూ అధికారులతో సంప్రదించి పరిష్కరిస్తామన్నారు.


చిన్నమండెం: వినతి పత్రాలు స్వీకరిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ఉద్యమంలా టీడీపీ సభ్యత్వ నమోదు

సిద్దవటం, అక్టోబరు 29 (ఆంధ్ర జ్యోతి) : తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా నిర్వహించాలని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాల సుబ్రమణ్యం తెలియజేశారు. మండల పరిధిలోని బాకరాపేట, మాధవరం గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దవటం మండల పరిధిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల పరిదిలో సభ్యత్వ నమోదు ఖర్చులకు రూ.50 వేలు ఇస్తానని రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు పత్తా రామచంద్రయ్య ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పంచాయతిరాజ్ చాంబర్ రాష్ట్ర ఆర్గ నైజర్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య, పార్లమెంట్ కార్యదర్శి నాగమునిరెడ్డి, యువ నాయకులు రాజా నాయుడు, సర్పంచ్ ప్రతినిధి వెంకటేశ్వర్లు, అవ్వారు జానకిరాం, రామ్మోహన్‌నాయుడు, జింక శివ, బండి ఓబులేశు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట: స్థానిక కోదండరామాలయ వెనుకభాగంలో సుగవాసి బాల సుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో సభ్యత్వాలు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ నాయకులు హరిప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, టీడీపీ నాయకులు ఎస్వీ రమణ, బొబ్బిలి రాయుడు, పామూరు సుబ్రమణ్యం, ఎంపీటీసీ సుభాన్‌బాషా, మౌలాలి, ఈశ్వరయ్య, సుబ్బరాయుడు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


ఒంటిమిట్ట: సభ్యత్వ నమోదు కార్యక్రమంలో సుగవాసి

ప్రతి గ్రామంలో సభ్యత్వ నమోదు చేయాలి

లక్కిరెడ్డిపల్లె: ప్రతి గ్రామంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించాలని మండల యువనాయకుడు యపమల మదన్ మోహన్ సూచించారు. అనంతపురం, యనమలవాండ్లపల్లె, వడ్డెపల్లెల్లో మంగళ వారం ఆయన సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ప్రతి కార్యకర్త సభ్యత్వం తీసుకుని టీడీపీ బలోపేతానికి తోడ్పడాలన్నారు. గోవింద్ వెంకటేసు, కావలి ఆంజనేయులు, దళిత వేదిక జిల్లా అధ్యక్షుడు ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.


లక్కిరెడ్డిపల్లె: మాట్లాడుతున్న మదన్‌మోహన్

గంజాయి స్మగ్లర్లపై కఠిన చర్యలు

● ఒకరి అరెస్ట్.. 20 కేజీల గంజాయి స్వాధీనం ● వివరాలు వెల్లడించిన ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు హెచ్చరించారు. మంగళవారం జిల్లా పరిధిలోని పీలేరు పట్టణంలో రాజీవ్‌నగర్, గోరీల తోపు వద్ద షేక్. మహబూబ్‌బాషా అనే వ్యక్తిని అరెస్టు చేసి , 20 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్న కేసు మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన షేక్. మహబూబ్‌బాషా గంజాయి అమ్ముతున్నట్లు గుర్తించి పీలేరు సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో అతనిని మంగళవారం పీలేరు పట్టణంలోని రాజీవ్‌నగర్ వద్ద అదుపులో తీసుకున్నారన్నారు. ఇటీవల రైలు కిందపడి చనిపోయిన విద్యార్థుల మరణానికి ఇతనే బాధ్యుడని అందిన ఫిర్యాదు మేరకు అరెస్టు చేసి అతని వద్ద నుండి 20 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పెట్టనున్నట్లు ఎస్పీ వివరించారు. మహబూబ్‌బాషా ఇచ్చిన సమాచారం మేరకు అతను ఎవరెవరి ద్గర గంజాయి కొన్నాడు. ఎవరికి అమ్ముతున్నాడు అన్న విషయం మీద ఆరాతీశామన్నారు. త్వరలో వారిని కూడా అరెస్టు చేస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు.


నిందితుడు, గంజాయి వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

స్కూటర్‌తో ఢీకొట్టి.. దాడి

పుల్లంపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : స్కూటర్‌తో ఢీకొనడంతోపాటు కిందపడిన వ్యక్తిపై దాడిచేసిన ఇద్దరిపై కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు పుల్లంపేటకు చెందిన దేవరకొండ నరసింహులు బైక్‌పై బైపాస్‌రోడ్డులోని ఇరానిచాయ్ దుకాణం వద్ద వెళుతుండగా టంగుటూరుకు చెందిన మునగ విజయమనోహర్, ఇండ్లూరుకు చెందిన నెల్లూరు వెంకటేశ్ బైక్‌తో వెనుక నుంచి బలంగా ఢీకొట్టారు. మా స్కూటర్‌కే అడ్డు వస్తావా అంటూ నరసింహులుపై దాడి చేశారు. బైకును బండరాళ్లతో కొట్టారు. ఈ కేసులో ముగ్గురిపై పుల్లంపేట పోలీసులు కేసు నమోదు చేశారు

గాలివీడులో ఘర్షణ వాతావరణం

గాలివీడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థలం విషయంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనడంతో మండల కేంద్రంలో మంగళవారం ఉద్రిక్తత ఏర్పడింది. మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద సర్వే నెంబర్ 2266 లోని 1.80ఎకరాల భూమిలో ఆర్‌అండ్‌బీకి 1.50 ఎకరాలు, 30 సెంట్లను పీహెచ్‌సీకి కేటాయించారు. ఖాళీగా ఉన్న ఆర్‌అండ్‌బీ స్థలంలో కొందరు పోటాపోటీగా రేకుల షెడ్లను ఏర్పాటు చేశారు. ఆ రేకుల షెడ్ల వెనుక భాగంలో ఖాళీగా ఉన్న జాగా తమ అనుభవంలో ఉందంటూ ఒక వర్గం వ్యక్తులు రేకులతో బౌండరీ ఏర్పాటు చేసుకున్నారు. అయితే అది తమ పట్టా భూమి అంటూ మరోవర్గం వారు ఆ రేకులను తొలగించారు. దీంతో రెండు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. రేకుల షెడ్లను స్వచ్ఛందంగా తొలగించుకోని పక్షంలో వారం రోజుల్లో తామే తొలగిస్తామని ఆర్‌అండ్‌బీ డీఈ వెంకటసుబ్బయ్య తెలిపారు.

మహిళ అదృశ్యం

సిద్దవటం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఎగువపేట దళితవాడకు చెందిన మహిళ అదృశ్యం కావడంతో మంగళవారం రాత్రి పెన్నానది పరిసర ప్రాంతాల్లో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. మహిళ అదృశ్యం అయినట్లు తెలియడంతో గాలిస్తున్నామని ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

పంటల బీమాను సద్వినియోగం చేసుకోవాలి

సుండుపల్లె, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): క్రాప్ ఇన్సూరెన్స్ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జేడీఏ చంద్రానాయక్ తెలిపారు. మాచిరెడ్డిగారి పల్లె గ్రామ పంచాయతీలోని వాయలొడ్డు బిడికీలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్, రబీ సీజన్‌లో క్రాప్‌లోన్ తీసుకున్న రైతులు పంటబీమా ప్రీమియం చెల్లించాలన్నారు. క్రాప్‌లోన్ తీసుకోని రైతులకు కూడా కామన్ సర్వీస్ సెంటర్, మీసేవ, ఆర్ఎస్కే కేంద్రాల్లో కూడా అప్‌డేట్ చేసుకునే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం సాధారణ పంటలకు 2 శాతం, ఉద్యాన పంటలకు 5 శాతం ప్రీమియం చెల్లించాలని సూచించారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం

రైల్వేకోడూరు, అక్టోబరు 29:(ఆంధ్రజ్యోతి) కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వానికి సరైన సమయంలో బుద్ధి చెబుతామని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రాధాకృష్ణయ్య తెలిపారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

కోడింగ్‌పై అవగాహన అవసరం


కోడింగ్‌పై వివరిస్తున్న వక్తలు


రామాపురం, అక్టోబరు 29 (ఆంధ్ర జ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులకు కోడింగ్‌పై అవగాహన అవసరమని కేఎస్ ఆర్ఎం ఇంజనీరింగ్ అసోసియేట్ అన్నారు. స్థానిక బిట్స్ కళాశాలలో మంగళవారం ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు కోడింగ్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వెంకట్రమణ ప్రోగ్రామింగ్ భాషలను విద్యార్థులకు వివరించారు. కోడింగ్ ప్రక్రియపై సందేహాలను నివృత్తి చేసు కునేందుకు ఈ వర్క్‌షాప్ దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

సామాజిక తనిఖీ ప్రజావేదికలో రూ.22,732 రికవరీ

ఓబులవారిపల్లె, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని 22 గ్రామ పంచాయతీల్లో గత సంవత్సరం మార్చి నుంచి 2024 మార్చివరకు చేసిన 1291 పనులు, రూ. 7,87,43,722 వ్యయంపై ఉపాధి పనులపై ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మంగళవారం ప్రజావేదిక నిర్వహించారు. రూ. 22,732 దుర్వినియోగమైనట్లు గుర్తించి రికవరీకి ఆదేశించారు. ఎంపీడీవో మల్లిరెడ్డి, జడ్పీటీసీ సభ్యులు లక్ష్మీ నరసయ్య, ఏపీవో ధనుంజయనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రైల్వేకోడూరు, అక్టోబరు 29:(ఆంధ్రజ్యోతి) ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ కోరారు. మంగళవారం రైల్వేకోడూరులో నిర్వహించిన ఆటో, ట్రాలీ కార్మికుల యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటో, ట్రాలీ డ్రైవర్ల సంక్షేమానికి కేరళ తరహాలో చట్టాలు తీసుకుని రావాలని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.




ఆదిమానవుడు చిత్రీకరించిన రేఖాచిత్రాలు

అపురూపాలు
ఆదిమానవుడి రేఖాచిత్రాలు



25వేల ఏళ్ల నాటి ఆదిమానవుని ఆనవాళ్లు ● చింతకుంట కొండలో పెరుగుతున్న సందర్శకుల సందడి
రక్షణ కల్పించలేని పర్యాటక, పురావస్తు శాఖలు ● రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు దృష్టి పెట్టాలంటున్న పర్యాటకులు


ముద్దనూరు అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): ఎంతో అరుదైన, అపురూపమైన ఆదిమానవుడు రేఖా చిత్రాలు చింతకుంట కొండలో కనువిందు చేస్తున్నాయి. 25 వేల ఏళ్ల కిందట ఇక్కడ మానవులు ఆవాసం ఏర్పరచుకున్నారని, జీవించారని, కొండపై చిత్రించిన రేఖా చిత్రాలు ఆధారభూతమై నిలుస్తున్నాయి. ఇక్కడి వాతావరణం, నీరు, ఆహారం పుష్కలంగా ఉండడంతో ఆదిమానవుడు ఆవాసానికి అనువైన ప్రదేశంగా ఎంచుకుని నివసించి ఉంటారని దాదాపు 200 రేఖాచిత్రాలను తిలకించిన మేధావులు అభిప్రాయపడుతున్నారు. వీరు ఏర్పాటు చేసుకున్న నివాస ప్రదేశాల ఆచూకీ తెలుసుకునేందుకు అనువుగా అక్కడక్కడా ఎరుపు రంగు ఆకుపసరుతో బాణం గుర్తులను ఏర్పాటు చేసుకున్నారని అంటున్నారు. ఈరేఖా చిత్రాల ఆధారంగా ఆదిమానవుడు దాదాపు 12 అడుగుల ఎత్తు ఉండవచ్చని, కొండలో ఇంకా గాలిస్తే ఎన్నో ఆనవాళ్లు లభించే అవకాశం వుందని అంటున్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ కనబరిస్తే ఆదిమానవుడి ఆనవాళ్లు మరెన్నో గుర్తించవచ్చు. వివరాల్లోకెళితే....

నాటి చరిత్ర, నేటి యువతరానికి ప్రతీకలు, శతాబ్దాలు దాటిన ప్రతి ఆనవాళ్ల చరిత్రకు ప్రతీకగా, అపురూపంగా భావించి, వాటి అభివృద్ధి, రక్షణ కోసం పర్యాటక, పురావస్తు శాఖలను ఏర్పాటు చేశారు. కోతి ద్వారం ప్రతి ఒక్కటీ చరిత్రను సృష్టిస్తున్నాయి. 2010 ఆగస్టు 17న అప్పటి ఎంపీడీఓ మొగిలిచెండు సురేష్, వివేకవర్ధిని జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకులు పుల్లారెడ్డి, కడప ఇన్‌టాక్ లైఫ్‌మెంబర్, అప్పటి జిల్లా కన్వీనర్ సీతారామయ్య, అప్పటి ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా అధికారి సత్యం కొందరు పత్రికా విలేకరుల సహకారంతో ఆది మానవుడి ఆనవాళ్ల కోసం కొండలో గాలించి ఆదిమానవుడి రేఖాచిత్రాలను వెలుగులోకి తెచ్చారు. ఎద్దుల ఆవులగుండు, గొడుగుగుండు, చిన్నావిడగుండు, పెద్దావిడ గుండు, మారెమ్మగుండు, గనంగుండు, మబ్బుగుండు, చిలకలోల్లగుండు ఇంకా ఎన్నో గుండ్ల పై ఆదిమానవుడు నాటి నాగరికత, పనిముట్లు, జంతువుల రేఖాచిత్రాలను కొండరాళ్లకు ఆకుపసరుతో నేటి యుగానికి కనువిందు చేసేలా చిత్రించాడు. ఏనుగు, జింక, దుప్పి, నక్క, కుందేలు, పక్షులు, ఎద్దు, విల్లంబులు ఎక్కుపెట్టిన మానవాకృతులు, అప్పటి వేటకు ఉపయోగించే పనిముట్లు, లైంగిక చిత్రాలు, దాదాపు 200 రేఖాచిత్రాలు కనిపిస్తాయి. ఈరేఖాచిత్రాలను తిలకించిన మేధావులు ఆది మానవుడు నివాసానికి అనువైన ప్రదేశంగా ఎంచుకుని ఆవాసం ఏర్పరచుకుని ఉంటారని అంటున్నారు. ఈరేఖా చిత్రాల ఆధారంగా ఆది మానవులు ఎక్కువ సంఖ్యలో ఉండి వుంటారని తెలుస్తోంది. అంతే కాకుండా ఇక్కడ వారి నివాసాలను గుర్తించేందుకు అనువుగా ఎరుపు రంగుతో బాణం గుర్తులను ఏర్పాటు చేసుకున్నారని అంటున్నారు. అంతేకాకుండా వారు మరణిస్తే మృతదేహం పట్టేలా రాతి గుండును మలిచి మృతదేహాన్ని దానిలో పడుకోబెట్టి సీసంతో నింపి అంత్యక్రియలు చేసేవారని వివరిస్తున్నారు. ఈప్రదేశంలో అటువంటి శ్మశానవాటిక ఉండవచ్చని వెదికితే గుర్తించవచ్చని అంటున్నారు. కొండలో గాలిస్తే మరెన్నో ఆనవాళ్లు లభించే అవకాశం వుందని, ఇటువంటి వాటిని గుర్తించి వాటిని భద్రపరిస్తే చరిత్రకు ఆనవాళ్లుగా నిలుస్తాయని అంటున్నారు. రేఖాచిత్రాలు వెలుగు చూసిన తరువాత ఈ ప్రదేశాన్ని ఎందరో సందర్శనార్థం వస్తున్నారు. కొండపైకి వెళ్లాలంటే దారి సరిగాలేక పోవడంతో 2010లో ఉపాధి పథకంలో భాగంగా పర్యాటకుల కోసం అప్పటి ఎంపీడీఓ మొగిలిచెండు సురేష్ గ్రావెల్ రోడ్డును ఏర్పాటు చేయించారు. 2010 ఆగస్టు24న అప్పటి డీపీఆర్‌ఓ ప్రసాద్, యోగివేమన యూనివర్సిటీ ప్రొఫెసర్లు సాంబశివారెడ్డి, రామబ్రహ్మం విద్యార్థులతో కలిసి సందర్శించారు. తరువాత 2011 ఫిబ్రవరి19న అప్పటి డీపీఆర్‌ఓ గోపాల కొండలోని అన్ని గుండ్లకు ఉన్న రేఖా చిత్రాలను సందర్శించారు. అప్పట్లో జమ్మలమడుగ న్యాయమూర్తి, న్యాయవాదులు, ఆర్టీపీపీ ఉద్యోగులు రేఖాచిత్రాలను సందర్శించారు. మనరాష్ట్రం విద్యార్థులే కాకుండా కర్నాటక రాష్ట్రం నుంచి విద్యార్థులు సందర్శనార్థం వస్తూనే వున్నారు. ఆతర్వాత 6వతరగతి సాంఘిక శాస్త్రంలో ఆహార సేకరణ నుంచి ఆహార ఉత్పత్తి వరకు ఆదిమానవుడు పాఠ్యాంశంలో రచయిత, ప్రస్తుతం సంబేపల్లె హెచ్‌ఎం మడితాటి నరసింహారెడ్డి పొందుపరిచారు. దీంతో ఈ ప్రదేశంపై రాష్ట్ర విద్యార్థులు తెలుసుకునే అవకాశం కలిగింది. ఎంతో చరిత్ర కలిగిన ఆదిమానవుడి రేఖాచిత్రాలకు పర్యాటక, పురావస్తు శాఖ వారు రక్షణ కల్పించలేకపోతున్నారు. అప్పట్లో సందర్శనార్థం వచ్చిన కడప అక్షర పాఠశాల విద్యార్థులపై తేనెటీగలు దాడి చేశాయి. అయినా అధికారులు స్పందించక పోవడం గమనార్హం. ఇప్పటికైనా సందర్శకులకు రక్షణ కల్పించ వలసిన అవసరం ఎంతైనా వుంది.

ఆదిమానవుడు రూపాంతరం చెందుతూ నేడు మనిషిగా మనుగడ కొనసాగిస్తున్నాడు. అటు వంటి ఎంతో పురాతన చరిత్ర కలిగిన 25వేల ఏళ్ల నాటి ఆదిమానవుడి ఆనవాళ్లు ఉన్న రేఖాచిత్రాలను, తిలకించేందుకు వచ్చే సందర్శకులకు చింతకుంట కొండలో రక్షణ కరువైందన్న విమర్శలు వస్తున్నాయి.

చింతకుంట పంచాయతీలోని కొండలు ఎంతో ఆహ్లాదకరంగా ఉన్నాయి. కొండపై నెలకొన్న కోనలింగేశ్వరస్వామి(శివాలయం), సమీపంలోనే 1909 బ్రిటీషర్లు ఏర్పాటు చేసిన విశాలమైన జలాశయాన్ని తలపిస్తున్న చింతకుంట చెరువు. ఈప్రదేశంలో నెలకొన్న



రేఖాచిత్రాల అన్వేషణ కోసం మొదటగా వెళుతున్న ఇన్‌టాక్ సభ్యులు, యోగివేమన ప్రొఫెసర్లు,పర్యాటకశాఖ, అధికారులు, ఎంపీడీఓ - గొడుగు గుండు - మబ్బు గుండులో అప్పటి డీఆర్‌డీఏ పీడీ, పర్యాటకశాఖ గోపాల్, ఎంపీడీఓ మొగిలిచెండు సురేష్

వాల్మీకిపురంలో యువకుడి హత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ

వాల్మీకిపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ కాలనీలో సోమవారం రాత్రి జరిగిన కుటుంబ గొడవలో అజయ్ కత్తితో పొడవడంతో రమేష్(35) అక్కడికక్కడే మృతి చెందాడు. సీఐ ప్రసాద్‌బాబు కథనం మేరకు వివరాల్లోకెళితే...

రమేష్ గుర్కా, కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. తల్లి, తండ్రి తమ్ముడు పిల్లలతో ఉమ్మడిగా కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నారు. రమేష్ నిత్యం మద్యం తాగి ఇంటికి వచ్చి అందరినీ వేధిస్తుండేవాడు. సోమవారం రాత్రి రమేష్ మద్యం తాగి ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులను దుర్భాషలాడుతూ గొడవకు దిగాడు. కుటుంబీకులను దూషిస్తుండడంతో సహించలేక అడ్డుకునేందుకు యత్నించిన రమేష్ అన్న కుమారుడు అజయ్‌పై దాడి చేశాడు. దీంతో అజయ్ కత్తితో పొడవడంతో రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీఐ ప్రసాద్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నిందితుడు అజయ్‌ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ...!

- రైతులను చూసి పారిపోయిన దుండగులు



ధ్వంసం చేసిన బీరువా

గుర్రంకొండ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణానికి సమీప ఓనిలోని ఆంజనేయస్వామి ఆలయంలో దుండగులు చోరీకి యత్నించారు. పొలాలకు నీరు పారించడానికి వచ్చిన రైతులను చూసి దుండగులు పరారైనట్లు తెలిసింది. స్థానికుల కథనం మేరకు పట్టణానికి కూత వేటు దూరంలో ఓనిలో చాలా పురాతనమైన ఆంజనేయస్వామి ఆలయం ఉంది. కాగా తెల్లవారుఝామున కొందరు దుండగులు ఆలయం తాళాలను పగలకొట్టి లోపలికి ప్రవేశించి ఆలయం బీరువాను ధ్వంసం చేశారు. అనంతరం స్వామి వారికి ఏర్పాటు చేసిన వెండి మకరతోరణాన్ని ధ్వంసం చేసి గోనె సంచిలో ఉంచారు. హుండీని కూడా పగలకొట్టి అందులోని సొమ్ము చోరీ చేశారు. ఆ సమయంలో రైతులు పొలాల వద్దకు వస్తున్నట్లు గమనించిన దుండగులు చోరీ చేయడానికి తెచ్చిన కత్తి, ఇతర పరికరాలను అక్కడే వదిలి పరారైనట్లు రైతులు చెబుతున్నారు. విషయాన్ని ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు తెలపడంతో ఘటనా స్థలానికి వెళ్లి చోరీ జరిగిన తీరును పరిశీలించారు. నిందితులను కనిపెట్టి తగు చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ మధురామచంద్రుడు తెలిపారు.

భూఆక్రమణదారులపై కేసులు నమోదు



ఆక్రమణ దారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న రెవెన్యూ, పోలీసు అధికారులు

అట్లూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నల్లాయపల్లె భూములను ఆక్రమించబోయిన పలువురిని బైండోవర్ చేసుకున్నట్లు డిప్యూటీ తహసీల్దారు శిరీషా తెలిపారు. బద్వేలు మండలానికి చెందిన ఉదయగిరి సుభాన్‌బాషా, ధర్మశెట్టి వెంకటసుబ్బయ్య మరో 30 మందితో మంగళవారం ప్రభుత్వ భూమి ఆక్రమించేందుకు యత్నించి స్తంభాలు పాతి కంచె వేసేందుకు ప్రయత్నించారు. రెవెన్యూ అధికారులకు సమాచారం తెలియడంతో డిప్యూటీ తహసీల్దారు శిరీషా, అట్లూరు ఎస్‌ఐ రామకృష్ణ ఆక్రమిత స్థలానికి చేరుకుని ఆక్రమణదారులను అదుపులోకి తీసుకుని వారిని బైండోవర్ చేసినట్లు డిప్యూటీ తహసీల్దారు తెలిపారు. ఎవరైనా నల్లాయపల్లె భూములను ఆక్రమించేందుకు యత్నించినా కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు ఆర్‌ఐ రమణ, వీఆర్వో సుబ్బయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రచందనం స్మగ్లర్లపై ఉక్కుపాదం



వెనుకజలాలను పరిశీలిస్తున్న డీఎఫ్‌ఓ

ఒంటిమిట్ట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం స్మగ్లర్లను అణచివేస్తామని కడప డీఎఫ్‌ఓ వినీత్‌కుమార్ హెచ్చరించారు. సోమశిల వెనుక జలాలను పరిశీలించిన ఆయన ఫారెస్ట్ పరిధిలో అనుమతి లేకుండా ఎవరూ సంచరించకూడదని, నిషేధిత ప్రాంతంలోకి అనుమతి లేకుండా ఎవరు వెళ్లినా చర్యలు తీసుకుంటామన్నారు. వన్య ప్రాణులకు తాగునీటి కల్పనపై అధికారులకు సూచనలిచ్చారు. అభివృద్ధి పనులను అవినీతికి తావులేకుండా చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజర్ ప్రణీతి, ఎఫ్ఎస్‌ఓ బ్రహ్మయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

● రాష్ట్ర స్థాయిలో బాలుర విజేత కడప ● బాలికల విజేత చిత్తూరు జట్టు




అండర్-17 కబడ్డీ బాలికల విభాగంలో రాష్ట్ర స్థాయి విజేతగా నిలిచిన చిత్తూరు జట్టు - హాజరైన వివిధ జిల్లాల క్రీడాకారులు

రాయచోటిటౌన్, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పాఠశాల విద్యాశాఖ పర్యవేక్షణలో స్కూల్ గేమ్స్ ఫెడ రేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకు అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో అట్టహాసంగా సాగిన అండర్-17 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు మంగళవారం ముగిశాయి. కబడ్డీపోటీల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం కార్యక్రమానికి హాజరైన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు, టీడీపీ యువనేత డాక్టర్ మండి పల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. తమ సోదరుడు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సహకారంతో పట్టణంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఐపీఈ భానుమూర్తిరాజు మాట్లాడుతూ అండర్-17 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు రాయచోటి ఆతిధ్యం ఇవ్వడం ఆనందంగా ఉంద న్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి వచ్చిన 26 జట్ల బాల బాలికల క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్ర స్థాయికి ఎంపికకావడం సంతోషంగా ఉందన్నారు. డీఈఓ సుబ్రమణ్యం మాట్లాడుతూ విద్యార్థులకు చదు వే కాకుండా క్రీడలు కూడా చాలా అవసరం అన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం ఏర్పడుతుందన్నారు.

అనంతరం బాలుర విభాగంలో మొదటి స్థానంలో నిలిచిన కడప జిల్లా జట్టుకు రూ.25 వేలు, బాలికల విభాగం మొదటి స్థానంలో నిలిచిన చిత్తూరు జిల్లా జట్టుకు రూ.25 వేలు, బాలుర విభాగం రెండో స్థానంలో నిలిచిన అనంతపురం జట్టుకు రూ.15 వేలు, బాలికల విభాగం రెండో స్థానంలో నిలిచిన శ్రీకాకుళం జట్టుకు రూ.15 వేలు, బాలుర విభాగంలో మూడో స్థానంలో నిలిచిన కర్నూలు జట్టుకు రూ.10 వేలు, నాలుగో స్థానంలో నిలిచిన చిత్తూరు జట్టుకు రూ.10 వేలు, బాలికల విభాగంలో మూడో స్థానంలో నిలిచిన అనం తపురం జిల్లా జట్టుకు రూ.10 వేలు, కృష్ణా జిల్లా జట్టుకు రూ.10 వేలు చొప్పున నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేసి అభినం దించారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ సెక్రటరీలు వసంత, అరుణ కుమారి, కబడ్డీ పోటీల ఆర్గనైజింగ్ సెక్రటరీ వీరాంజనేయులు, ఉపాధ్యాయ సంఘం చీఫ్ పాటర్న్ నరసరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర జట్టుకు ఎంపికైన బాలబాలికలు వీరే

అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో మూడు రోజులు పాటు జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి జట్లకు బాలబాలికలను ఎంపిక చేశారు. ఈ జట్లు మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాయి.

బాలుర జట్టు: నూర్‌బాషా, బ్రహ్మయ్య, మద్దిలేటి స్వామి (కడప), విష్ణు (అనంతపురం), ఎన్‌ఎస్‌జాన్ పీటర్ (చిత్తూరు), బటీ గుర్రప్ప (కర్నూల్), రామకృష్ణ (ప్రకాశం), పవన్‌కల్యాణ్ రెడ్డి(గుంటూరు), బీహెచ్ తీషిత్ (కృష్ణ), గంగరాజు (విజయనగరం), సోమేశ్ (ప్రకాశం), దామోదర్‌నాయుడు (కడప), లీలాధర్ (కర్నూలు), సందీప్ (చిత్తూరు).

బాలికల జట్టు: లిఖిత, సనా (చిత్తూరు), యమున (శ్రీకాకుళం), అర్చన (శ్రీకాకుళం), హిమజ, నవ్య(అనంతపురం), కీర్తన (కృష్ణ), శిరీష (కర్నూలు), దేవికాబాయి (గుంటూరు), లక్ష్మీదేవి (విజయనగరం), దివ్య(విశాఖపట్నం), రెడ్డికావ్యశ్రీ (కడప), త్రిపుర (ప్రకాశం), జ్యోతి (కృష్ణ), పల్లవి (చిత్తూరు).

బి.కొత్తకోటలో రెండు గంటలు హైరానా

కుటుంబ సమస్యలతో వాటర్‌ట్యాంక్ ఎక్కిన కార్మికుడు ● ప్రాణాలు కాపాడిన అగ్నిమాపక సిబ్బంది

బి.కొత్తకోట, అక్టోబరు(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుడు పోలీసులు, ప్రజలను రెండు గంటలపాటు హైరానా పట్టించాడు. స్థానిక ఎస్సీ కాలనీ వాసి కార్మికుడు కోగర శ్రీనివాసులు సాయంత్రం జ్యోతిసర్కిల్‌లో ఉన్న 60 అడుగుల ఎత్తైన వాటర్ ట్యాంకును ఎక్కాడు. ట్యాంక్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకోబోతున్నానని పలువురికి ఫోన్ చేశాడు. విషయం తెలియడంతో శ్రీనివాసులు భార్య శిరీష, ముగ్గురు పిల్లలు, సీఐ రాజారెడ్డి, సిబ్బంది ట్యాంకు వద్దకు చేరుకున్నారు. కానిస్టేబుల్ జబీవుల్లా ట్యాంక్ ఎక్కి దూకకుండా ఆపగలిగారు. విషయం దావానలంలా వ్యాపించడంతో జనం పెద్దసంఖ్యలో గుమిగూడారు. దీంతో సర్కిల్‌లో ట్రాఫిక్ అంతరాయం కలిగింది. సీఐ మదనపల్లె అగ్నిమాపకదళాన్ని పిలిపించి ట్యాంకునీటిలో దిగిన కార్మికుడిని వలలో బంధించి ఫైర్‌సిబ్బంది కిందికి దింపారు. పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా శ్రీనివాసులుకు వెన్నెముక ఆపరేషన్ జరగడంతో పనులు చేయలేక పోతున్నాడని, భార్య తో సఖ్యతలేక పోవడంతో జీవితంపై విరక్తి చెందాడని, మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తే జీతం పెండింగ్‌లో పెట్టారని శ్రీనివాసులు చెప్పి నట్లు సీఐ తెలిపారు. భార్యాభర్తలకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.



జ్యోతిసర్కిల్‌లో గుమికూడిన జనం



ట్యాంకు నుంచి వలలో కిందికి దింపుతున్న అగ్నిమాపక సిబ్బంది

సీబీఐ డీఐజీగా వెంకటసుబ్బారెడ్డి



ఎర్రగుంట్ల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సీబీఐ డీఐజీగా చిన్నకొండు వెంకటసుబ్బారెడ్డి నియమితులయ్యారు. ఎర్రగుంట్ల మండలం హనుమనగుత్తి గ్రామానికి చెందిన ఐపీఎస్ అధికారి చిన్నకొండు వెంకటసుబ్బారెడ్డి 2007 అస్సాం-మేఘాలయ క్యాడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి. అప్పట్లో ఆయన 126 ర్యాంకు సాధించి ఐపీఎస్‌గా ఎంపికయ్యారు. ప్రస్తుతం మేఘాలయ డీఐజీగా పనిచేస్తున్నారు. సీబీఐ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా వెంకటసుబ్బారెడ్డిని నియమిస్తూ కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు చేసింది. ఈయన ఐదేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారు. సాధారణ మధ్యతరగతి రైతు కుటుంబానికి చెందిన ఈయన కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకున్నారు. అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రస్తుతం సీబీఐ డీఐజీ స్థాయికి చేరుకున్నారు. వెంకటసుబ్బారెడ్డిని సీబీఐ డీఐజీగా నియమించడంతో తల్లిదండ్రులు వెంకటలక్షుమ్మ, రమణారెడ్డి, గ్రామస్తులు, బంధువులు హర్షం వ్యక్తం చేశారు.

రూ.2.56 లక్షలు వెంటనే చెల్లించాలి



హనీఫ్‌బాషాను విచారిస్తున్న డీఎల్‌పీఓ తిమ్మక్క

చాపాడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కంప్యూటర్ ఆపరేటర్ హనీఫ్‌బాష వాడుకున్న రూ.2.56 లక్షలను 15 రోజుల్లోగా చెల్లించాలని జమ్మలమడుగు డీఎల్‌పీఓ తిమ్మక్క ఆదేశించారు. ఎంపీడీఓ కార్యాలయం కంప్యూటర్ ఆపరేటర్ హనీఫ్‌బాష జనవరి నెలలో భద్రిపల్లె పంచాయతీకి చెందిన రూ.2.56 లక్షలు సర్పంచు, అధికారి అనుమతి లేకుండా వాడుకున్నారు. మంగళవారం భద్రిపల్లెలో విచారించిన ఆమె ఈ డబ్బును ఎందుకు వాడుకున్నావని హనీఫ్‌ను ప్రశ్నించారు. తన భార్యకు చికిత్స కోసం వాడుకున్నానని హనీఫ్‌బాష వివరణ ఇస్తూ తిరిగి చెల్లిస్తానని తెలిపారు. ఈఓపీఆర్‌డీ క్రిష్ణవేణి, సర్పంచ్ మల్లేశ్వరి పాల్గొన్నారు.

పోల్‌వాల్ట్‌లో చరణ్‌కు గోల్డ్‌మెడల్

దువ్వూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పుల్లారెడ్డిపేట డిగ్రీ కాలేజీ విద్యార్థి ఎస్.చరణ్ పోల్‌వాల్ట్ ఈవెంట్‌లో ప్రథమస్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించినట్లు కళాశాల వ్యాయామ అధ్యాపకులు కె.కన్నయ్య తెలిపారు. కర్నూలులో జరిగిన ఈ పోటీలో విద్యార్థి ప్రతిభను కొనియాడుతూ కాలేజీ కరస్పాడెంట్ ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి అతనిని అభినందించినట్లు చెప్పారు.

ప్రభుత్వాస్పత్రిలో మందులు చోరీ

మదనపల్లె టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మదనపల్లె సర్వజన బోధనాస్పత్రిలో మందుల చోరీ విషయం మంగళవారం రాత్రి వెలుగులోకి వచ్చింది. సర్వజన బోధనాస్పత్రిలో ఓ సెక్యూరిటీ మహిళా గార్డు విధుల నుంచి దిగి వెళ్లే సమయంలో ఆమె బ్యాగులో కొన్ని మందులు, సెలైన్ బాటిళ్లు వుండడాన్ని కొందరు వీడియో తీసి వైరల్ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజుకు కొందరు ఫిర్యాదు చేశారు. సెక్యూరిటీ గార్డును విచారించి ఆస్పతిలో ఉండాల్సిన మందులు గార్డు బ్యాగులో ఉండడంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

మూడు ఆలయాల్లో చోరీ

మదనపల్లె అర్బన్, అకోటబరు29:(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం, టీకేపల్లెలోని మూడు ఆలయాల్లో దొంగలు చోరీ చేశారు. కనకదాస్‌నగర్ పాలేటమ్మ ఆలయం, ఇదే ప్రాంతంలోని వరసిద్ధి వినాయక స్వామి ఆలయం, జాతీయరహదారి ఆనుకుని ఉన్న వరాల గంగమ్మ ఆలయంలో దొంగలు హుండీలను దోచుకెళ్లారు. స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ మేరకు టూటౌన్ పోలీసులు విచారణ చేపట్టారు.

మైలవరానికి 12000 క్యూసెక్కులు విడుదల

అవుకు నుంచి ఇన్‌ఫ్లో 12000 క్యూసెక్కులు

కొండాపురం, అక్టోబరు 29 (ఆంధ్ర జ్యోతి): గండికోట నుంచి మైలవరానికి మంగళవారం 12000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తునట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. కాగా ప్రాజెక్టులోకి అవుకు రిజర్వాయిర్ నుంచి జీఎన్‌ఎస్‌ఎస్ వరద కాల్వ ద్వారా 12000 క్యూసెక్కుల కృష్ణాజలాలు వచ్చి చేరుతున్నట్లు డీఈ తెలిపారు. మెయిన్ కెనాల్‌కు 75 క్యూసెక్కులు వదులుతున్నామని, గండికోటలో 26 టీఎంసీల నీరు ఉన్నట్లు డీఈ తెలిపారు.

కన్నేశారు.. అమ్మేశారు..!

- 2140 సర్వే నెంబరులో రూ.లక్షల విలువ చేసే స్థలం కబ్జా
- జగనన్న కాలనీ పేరిట అక్రమ పట్టాలు
- వైసీపీ నాయకులు, సానుభూతిపరులకు కట్టబెట్టిన నేతలు
- ప్రభుత్వం మారినా ఆగని అక్రమ కట్టడాలు



2140 సర్వే నెంబరులో అక్రమ కట్టడాలు

సుండుపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లు ప్రభుత్వ స్థలాలను వైసీపీ నాయకులు కొందరు తమ అనుచరులకు అప్పనంగా అప్పజెప్పారు. ఐదు సంవత్సరాలు ప్రభుత్వ భూములే లక్ష్యంగా అమ్ముకున్న సంఘటనలు ఒక్కొక్కటీ వెలుగు చూస్తున్నాయి. ఒకటా, రెండా మండల కేంద్రంలో వాగులు, వంకలు, గుట్టలు, చెరువులను వదలకుండా అమ్ముకుని అక్రమాలకు తెరలేపారు. ప్రభుత్వ స్థలం ఉందని తెలిస్తే చాలు ఐదు సంవత్సరాలుగా వైసీపీ నాయకులు వాటిని కబ్జా చేసి కోట్లు కొల్లగొట్టారు. సుండుపల్లి మండల ప్రజల అవసరాల కోసం మంచినీటిని శుద్ధి చేసి ప్రజలకు అందించేందుకు 2017 టీడీపీ ప్రభుత్వంలో కేటాయించిన స్థలాన్ని వైసీపీ పాలనలో దర్జాగా అక్రమించి ప్లాట్లు వేసి వైసీపీ నాయకులు అమ్మేశారు. ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం ఏర్పాటు చేసి 2 రూపాయలకే తాగునీరు అందించాలన్న సంకల్పంతో టీడీపీ హయంలో అప్పటి ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి అధికారికంగా ఆగ్రహారం సమీపంలోని పెట్రోల్ బంకు వెనుక భాగంలో శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. తాగునీటి కోసం వేలాది రూపాయలు ఖర్చు చేసి బోరు వేశారు. ఆ స్థలాన్ని వైసీపీ అధికారంలోకి వచ్చాక కబ్జా చేసి పక్కా ప్లాన్ ప్రకారం ప్లాట్ రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు అమ్ముకున్నారు. అంతేకాకుండా అప్పట్లో ఎవ్వరికీ అనుమానం రాకుండా అధికారులను తమకు అనుకూలంగా ఉండే వారిని మండల కేంద్రంలో వీఆర్వోలుగా నియమించుకుని జగన్న కాలనీ పేరుతో 2140 సర్వే నెంబరులో ప్రభుత్వ స్థలాన్ని ప్లాట్లుగా మార్చి అమ్ముకున్నారు. ఆ సర్వే నెంబరులో 1.25 ఎకరాల ప్రభుత్వ స్థలానికి అక్రమ పట్టాలు సృష్టించి లక్షల రూపాయలు దండుకున్నారు. ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం ఏర్పాటు కోరకు వేసిన శిలా ఫలకాన్ని మాయం చేశారు. అదే ప్రదేశంలో ఇప్పుడు ఇంటి నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇదంతా తెలిసినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. జగనన్న కాలనీ పేరిట దొంగ పట్టాలు సృష్టించి అమ్మకాలు చేశారు. 2140 సర్వే నెంబరులో ఎటువంటి పట్టాలు ఇవ్వలేదని అధికారులు చెబుతున్నారు కానీ అక్కడ ప్లాట్లు వేసి అమ్మి నిర్మాణాలు చేపడుతున్నా ఎటువంటి చర్యలు మాత్రం తీసుకోలేదు. అప్పటి తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, సర్వేయరు అక్కడ జగనన్న కాలనీ ఏర్పాటు చేయలేదని, పట్టాలు ఇవ్వలేదని రాత పూర్వకంగా సమాచార హక్కు చట్టంలో కోరిన వారికి ఇచ్చారు. కానీ ఆ సర్వే నెంబరులో కొంతమంది వైసీపీ నాయకులు ప్లాట్లు వేసి దర్జాగా అమ్ముకుని లక్షలాది రూపాయలు సంపాదించుకున్నారు. అక్కడ ఇప్పుడు నిర్మాణాలు కూడా జరుగుతున్నాయి. అక్కడ అక్రమ నిర్మాణాలు తొలగించి ఆ స్థలాన్ని ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి వినియోగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

విచారించి చర్యలు తీసుకుంటాం..

అక్రమ నిర్మాణాలపై విచారించి చర్యలు తీసుకుంటాము. 2140 సర్వే నెంబరులో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్లు సమాచారం లేదు. ఆంధ్రజ్యోతి వివరణ అడగడంతో తెలిసింది. ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం శిలాఫలకం అప్పట్లో ఏర్పాటుపై మండల ఆర్‌డబ్ల్యుఎస్ అధికారిని విచారిస్తాము.


- దైవాదీనం, తహసీల్దారు, సుండుపల్లి

అప్పన్నకుంటలో అక్రమ నిర్మాణాలు

మండల కేంద్రంలోని అప్పన్న కుంట (సర్వే నెంబరు 2169లో) చుట్టూ అక్రమ నిర్మాణాలు పుట్టుకొస్తున్నాయి. సుమారు 25 ఎకరాలు ఉన్న కుంట రోజురోజుకు కర్పూరంలా కరిగిపోతోంది. పెద్ద పెద్ద భవనాలు కడుతున్నా రెవెన్యూ అధికారులు అది ప్రభుత్వ భూమి కాదని అనుకుంటున్నారేమో.. ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఫిర్యాదుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత నిర్లక్ష్యంగా ఉండడం వెనుక మతలబు ఏమిటో అర్థం కావడం లేదు. అప్పన్నకుంటను, ప్రభుత్వ స్థలాలకు రక్షణ కల్పిస్తారని అనుకుంటే వచ్చిన రెవెన్యూ సిబ్బంది మౌనంపై కూటమి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.

అక్రమ పట్టాలపై విచారణ ఎక్కడ

మండల కేంద్రంలో వైసీపీ అధికారంలో ఉన్నపుడు పదుల సంఖ్యలో అక్రమ పట్టాలు పుట్టుకొచ్చాయి. అవీనితి అధికారుల చేతివాటం, అప్పటి పాలకుల నియంత పాలనకు నిదర్శనంగా దొంగ పట్టాలు సృష్టించారు. వందలాది పట్టాలు పుట్టించి అక్రమ నిర్మాణాలకు తెరలేపారు. అందులో మండల కేంద్రంలో పనిచేసిన వీఆర్వోలు పైఅధికారుల హస్తం ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విచారణ నిర్వహిస్తామని చెప్పిన మాటలు నీటిపై రాతల్లా మారిపోయాయని అందరూ మాట్లాడుకుంటున్నారు. ఆ మాటలను నిజం చేసే విధంగా రెవెన్యూ అధికారుల తీరు ఉందని స్పష్టంగా తెలుస్తోంది. అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని కూటమి నేతలు ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవడం ఏమిటో అని ప్రజలు చర్చించుకుంటున్నారు.



2140 సర్వే నెంబరులో ఎటువంటి లేఅవుట్ వేయలేదని రాతపూర్వకంగా ఇచ్చిన అధికారులు



ఎటువంటి ఇంటి పట్టాలు ప్రభుత్వం ఇవ్వలేదని సమాచార హక్కు చట్టంలో ఇచ్చిన వైనం



అప్పన్నకుంట గట్టుపై నిర్మించిన మరుగుదొడ్లు



అప్పన్న కుంటలో అక్రమ నిర్మాణాలు

'జిల్లాపై అంత కక్ష ఎందుకు?'

వేంపల్లె, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి గారు కడప జిల్లాపై అంత కక్ష ఎందుకు అని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి ప్రశ్నించారు. వేంపల్లెలో మంగళవారం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మంత్రివర్గంలో కడప జిల్లాకు ప్రాతినిధ్యం లేదన్నారు. రూ.250కోట్లతో కడపజిల్లా కొప్పర్తి పారిశ్రామిక వాడకు సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల సాంకేతిక శిక్షణ కేంద్రాన్ని మంజూరు చేసిందన్నారు. సెప్టెంబరు 24న చంద్రబాబు ప్రభుత్వం ఈ కేంద్రాన్ని కొప్పర్తి నుంచి అమరావతికి మారుస్తూ జీఓ జారీ చేసిందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం కడప జిల్లాకు, రాయలసీమకు అన్యాయం చేస్తోందన్నారు.

తానా సదస్సుకు శివారెడ్డి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) నెలనెలా తెలుగు వెలుగు కార్యక్రమంలో భాగంగా ప్రాంతీయ మాండలిక భాష సాహిత్యాల అస్తిత్వం శీర్షికతో నవంబరు 24న జరగనున్న అంతర్జాతీయ అంతర్జాల సదస్సుకు సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డికి ఆహ్వానం అందింది. సదస్సులో రాయలసీమ యాసపై ఆయన ప్రసంగించనున్నారు. కార్యక్రమాన్ని తానా పూర్వ అధ్యక్షుడు డాక్టర్ తోటకూర ప్రసాద్ నిర్వహించనున్నారు. శివారెడ్డిని వైవీయూ వీసీ ప్రొఫెసరు క్రిష్ణా రెడ్డి, ఇన్‌చార్జ్ రిజిస్ట్రారు ప్రొఫెసరు పద్మ అభినందించారు.

2న చిత్రలేఖన పోటీలు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నవంబరు 2న చిత్ర లేఖన పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా బాలోత్సవం అధ్యక్షుడు గోపాల్, నాయకులు బి.లక్ష్మిరాజా, నాగమునిరెడ్డి, ఏలేశ్వర్ రావు తెలిపారు. మంగళవారం కడప యూటీఎఫ్ భవన్‌లో జిల్లా బాలోత్సవ సమావేశంలో వారు మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఉమ్మడి జిల్లాలో పులివెందుల, ప్రొద్దుటూరు, బద్వేలు, రాయచోటిలో చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

వైవీయూ పీఆర్ సెల్ సంచాలకులుగా డాక్టర్ సరిత



డాక్టర్ సరిత, ప్రొఫెసరు కాత్యాయనికి నియామకపత్రాలు అందిస్తున్న వైస్‌చాన్సలర్ కె.క్రిష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వైవీయూ పబ్లిక్ రిలే షన్ సెల్ డైరెక్టరుగా పద్మ సరితను నియమించారు. ఈమేరకు వైస్ చాన్సలర్ ప్రొఫెసరు కె.క్రిష్ణారెడ్డి తన చాంబర్‌లో ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ప్రొఫెసరు పద్మ సరితకు నియామకపత్రం అందించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంటు అసోసియేట్ ప్రొఫెసరుగా సరిత పనిచేస్తున్నారు. ఎన్ఎస్ఎస్ పీవోగా పలు సెల్‌లకు సమన్వయ కర్తగా శాఖాధిపతిగా పనిచేశారు. పరిశోధనల్లో పేటెంట్ కూడా పొందారు. పరిపాలన అనుభవం దృష్ట్యా డైరెక్టరుగా సరితను నియమించారు.

వైవీయూ అప్లైడ్ మేథమేటిక్ విభాగం ప్రొఫెసరు జి.కాత్యాయనిని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. వైస్ చాన్సలర్ ప్రొఫెసరు కె.క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రారు ప్రొఫెసరు పద్మ ఆమెకు నియామకపత్రం అందించారు. ఇదివరకు పరీక్షల చీఫ్ సూపరింటెం డెంట్‌గా పనిచేస్తున్న ప్రొఫెసరు పద్మను బాధ్యతల నుంచి తప్పించారు.

శిక్షణ ద్వారా యువత ఉపాధి పొందాలి

- జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్



జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్‌తో కెనరా బ్యాంకు ఆర్ఎం, డీఆర్డీఏ అధికారుల బృందం

కడప కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యువతకు ఆయా రంగాల్లో మంచి శిక్షణ ద్వారా వారి ఉపాధి మెరుగపరిచాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబరులో కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్, కెనరా బ్యాంకు ఆర్ఎం మురళీ మోహన్‌లు జిల్లాస్థాయి ఆర్సేటీ అడ్వైజరీ కమిటీ సమాశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ కమిటీ ఉద్దేశ్యాలపై రివ్యూ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆరు నెలల్లో ఎన్ని శిక్షణా కార్యక్రమాలు చేశారని, ఎంత మందికి ఉపాధి దొరికిందని అడిగి తెలుసుకున్నారు. నిరుద్యోగ యువతను సమీకరించి.. వారికి శిక్షణ ఇవ్వడం పట్ల కలెక్టర్ అభినందించారు. నవంబరు 20వ తేదీ నుంచి మహిళలకు దుస్తుల తయారీ, ఉమెన్స్ టైలర్, బ్యూటీ పార్లర్ మేనేజ్మెంట్, ఎంబ్రాయిడరీ, జూట్ బ్యాగుల తయారీని కడప కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఇక్కడ జరిగే అన్ని కార్యక్రమాలకు ట్రెనింగ్ మెటీరీయల్, వసతి, భోజన సదుపాయాలు పూర్తిగా ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమాలను అన్నమయ్య, కడప జిల్లా నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం జనార్ధన్ డీఆర్డీఏ పీడీ ఆనంద్‌నాయక్, నాబార్డు డీడీఎం విజ య్ విహారి, డీఐసీజీఎం చాంద్‌బాష, ఆర్సీ టీ డైరెక్టర్ ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో ప్రాణాలకు ముప్పు

- నెహ్రూయువ కేంద్ర జిల్లా యువ అధికారి మణికంఠ



మాట్లాడుతున్న నెహ్రూయువ కేంద్ర జిల్లా యువ అధికారి మణికంఠ

కడప మారుతీనగర్, అక్టోబర్ 29 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల వాడకంతో ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని నెహ్రూయువ కేంద్ర జిల్లా యువ అధికారి కె.మణికంఠ యువతకు సూచించారు. నెహ్రూయువ కేంద్రం, జేబీవీఎస్ ది ఫిరజర్వేర్ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఉక్కాయపల్లె నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో మాదక ద్రవ్యాలు యువతని ఏ విధంగా ప్రభావితం చేస్తున్నాయి అనే అంశంపై యువతీ, యువకులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలకు సంబంధించి ప్రత్యేక సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. యువత ఎక్కువగా మాదక ద్రవ్యాలకు అలవాటుపడి, అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్నారు. మత్తులో వున్న యువకులు ఇతరులతో అసభ్య ప్రవర్తనతో పాటు దొంగతనాలకు కూడా పాల్పడుతూ సమాజం ఛీ కొట్టేలా ప్రవర్తిస్తున్నతీరు సరికాదన్నారు. మొద ట సరదాగా మొదలయ్యే మాదకద్రవ్యాల వాడకం క్రమక్రమంగా పెరుగుతుందన్నారు. దీంతో బానిసలకు మారి అఘాయిత్యాలకు పాల్పడడం జరగుతున్నదన్నారు. కావున ఇప్పటికైనా యువత మాదక ద్రవ్యాల వాడడంపై సరైన అవగాహనతో మెలగి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. రిమ్స్ సైక్రియాట్రిస్ట్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరాముడు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ శ్రీధర్, సమితి వ్యవస్థాపకు లు అశోక్, మదర్ థెరిసా ఫౌండేషన్ చైర్మన్ విజయ్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

స్వల్ప స్కోర్‌కే చేతులెత్తేసిన గుంటూరు

- భారీస్కోర్ సాధించిన శ్రీకాకుళం, నెల్లూరు జట్లు



జోగేంద్ర (శ్రీకాకుళం) 124 నాటౌట్




5 వికెట్లు తీసిన శ్రీచరణ్ (విజయనగరం)

కడప స్పోర్ట్స్, అక్టోబర్ 29 (ఆంధ్రజ్యోతి) : కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-14 ఇంటర్ డిస్ట్రిక్ట్ గ్రూప్-బి మల్టీడే రెండు రోజుల క్రికె ట్ మ్యాచ్‌లలో భాగంగా మంగళవారం 152 పరుగుల స్వల్ప స్కోర్‌కే గుటూరు జట్టు ఆలౌట్ అయ్యింది. మరో రెండు వేర్వేరు మ్యాచ్‌లలో శ్రీకాకుళం, నెల్లూరు జట్లు భారీ స్కోర్లు సాధించాయి. వివరాలిలా....

కేఎస్ఆర్ఎం మైదానంలో క్రిష్ణా-గుంటూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ నెగ్గిన గుంటూరు జట్టు బ్యాటింగ్‌కు దిగి 63 ఓవర్లలో కేవలం 152 పరుగులకే చేతులెత్తేసింది. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన క్రిష్ణా జట్టు మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 28.3 ఓవర్లలో 1 వికెట్ మాత్రమే కోల్పోయి 80 పరుగులు చేసింది. ఇందు లో భానుచంద్‌యాదవ్ 42 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు. ఇంకా 72 పరుగుల వెనుకంజలో క్రిష్ణా జట్టు ఎదురీదుతోంది. అలాగే ఏసీఏ క్రికెట్ మైదానంలో విజయనగరం-శ్రీకాకుళం జట్ల మధ్య మ్యాచ్ సాగింది. టాస్‌నెగ్గిన శ్రీకాకుళం బ్యాటింగ్ చేపట్టి 89 ఓవర్లలో 336 పరుగులు భారీ స్కోర్ సాధించింది. ఇందులో ఎన్.జోగేంద్ర 124 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. కాగా బౌలింగ్ విభాగం లో శ్రీచరణ్ 5 వికెట్లు సాధించడం విశేషం.

కేఓఆర్ఎం మైదానంలో నెల్లూరు-అనంతపురం జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో తొలుత నెల్లూరు జట్టు 60.1 ఓవర్లలో 264 పరుగులు చేసింది. ఇందులో సుశాంత్ 75 పరుగులు చేశాడు. బౌలింగ్ విభాగం లో ఎండీ రోహిత్ 5 వికెట్లు పడగొట్టాడు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి 29 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 108 పరుగులు చేసింది. ఇందులో ఆదినారాయణరెడ్డి 45 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నాడు. కాగా మరో 156 పరుగుల లోటుతో అనంతపురం జట్టు ఎదురీదుతొంది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



మృతి చెందిన రాజశేఖర్

కమలాపురం రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నల్లింగాయపల్లె గ్రామం వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజశేఖర్ (56) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా.. తీవ్రంగా గాయపడిన సుబ్బరాయుడు(19) అనే యువకుడిని 108లో రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి వివరాల మేరకు.. ప్రొద్దుటూరు మండలం వినాయకనగర్‌కు చెందిన కాటం రాజశేఖర్ అనే వ్యక్తి అగస్త్యలింగాయపల్లెలో తమ బంధువుల పెళ్లికి వచ్చాడు. మలిపెళ్లి అయిపోయిన తరువాత తిరిగి ప్రొద్దుటూరుకు వెళ్లేందుకు రోడ్డుపై నడుచుకుంటూ పోతుండగా భారతి సిమెంటు ఫ్యాక్టరీ సమీ ంలోకి రాగానే ముద్దల సుబ్బరాయుడు స్కూటరుపై మరో వ్యక్తిని ఎక్కించుకుని అతివేగంగా వస్తూ.. అదుపు తప్పి రాజశేఖర్‌ను ఢీకొట్టాడు. దీంతో రాజశేఖర్ అక్కడికక్కడే మృతి చెందగా సుబ్బరాయుడుకు తీవ్ర గాయాలయ్యా యి. అతన్ని రిమ్స్‌కు తరలి స్తుండగా మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

త్రుటిలో తప్పిన రోడ్డు ప్రమాదం

- బాంబ్‌స్క్వాడ్ వాహనాన్ని ఢీకొన్న ఇసుక ట్రాక్టర్

వేంపల్లె, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిపల్లె వద్ద మంగళవారం ఉదయం బాంబ్‌స్క్వాడ్ వాహనాన్ని ఇసుక ట్రాక్టర్ ఢీకొంది. దీంతో బాంబ్‌స్క్వాడ్ వాహనం రోడ్డుపక్కనున్న పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాకపోవడంతో అందరు ఊపరిపీల్చుకున్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల పర్యటన నేపథ్యంలో బాంబ్ స్క్వాడ్ బృందం తనిఖీ చేసుకుంటూ పులివెందులకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

సాధారణ నిధులు వెచ్చించండి

- నిధుల వినియోగానికి కౌన్సిల్ తీర్మానం చేయండి..
- సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తా
- మున్సిపల్ సమావేశంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా
- ఎన్‌టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయండి వైస్‌చైర్మన్



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ సాధారణ నిధులు ఇక్కడిక్కడే వినియోగించుకునేలా కౌన్సిల్ తీర్మాణం(సీఆర్) చేయండి.. తాను ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ప్రయత్నం చేస్తానని ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం చైర్‌పర్సన్ వి.మనూజ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశానికి ఎక్స్‌అఫిషియో హోదాలో హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీలో సాధారణ, 15వ ఆర్థిక సంఘం, బీపీఎస్ పథకం నిధులు ఉన్నా వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో పట్టణంలో ఎక్కడా అభివృద్ధి పనులు చేపట్టడానికి అకావశం లేదని, ఇప్పటికే చేపట్టిన వంద నుంచి 150 పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు చేపట్టడానికి ముందుకు రాలేదని అటు అధికారులు, ఇటు కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తేవడంతో ఎమ్మెల్యే పైవిధంగా స్పందించారు. మనకు నిధులు అందుబాటులో ఉన్నా..సీఎఫ్ఎంఎస్ విధానంతో రూపాయి కూడా వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి, మున్సిపల్ సాధారణ నిధుల వరకూ రిలాక్సేషన్ ఇవ్వాలని కోరినట్లు గుర్తుచేశారు. ప్రజాసమస్యలు పరిష్కరించడానికి, పట్టణ అభివృద్ధికి పాలకవర్గం సహకరిస్తుందని, ఇందుకు సీఆర్ చేసి ఇస్తుందని మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి ప్రకటించారు. అందరితో కలసి పనిచేయడానికి తాను సిద్ధమేనని ఎమ్మెల్యే కూడా ప్రకటించడంతో కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అంతకు ముందు వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి మాట్లాడుతూ పట్టణంలో అభివృద్ధి పనులే కాదు ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ధ్వజమెత్తారు. తామేమీ వార్డుల్లో రోడ్లు, కాలువలు నిర్మించాలని కోరడం లేదని, కనీసం వీధిలైట్లు కూడా వేయించలేని పరిస్థితిలో కౌన్సిలర్లు ఉన్నారని వీటి ఏర్పాటుకు ఏఈ, డీఈ, కమిషనర్ వరకూ రోజుల తరబడి తిప్పుతున్నారని వాపోయారు. .ఎన్‌వీఆర్ పార్కులో చెట్లు కత్తరించడం, గడ్డి చెక్కేందుకు కూడా కార్మికులు లేక పాములు వస్తున్నాయని ఇలాంటి చిన్నచిన్న పనులు కూడా చేయ లేనప్పుడు ఈ కౌన్సిల్ ఎందుకని ప్రశ్నించారు. స్థానిక నిమ్మనపల్లె సర్కిల్‌లో టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత ఎన్‌టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరగా, అందుకు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అంగీకరించారు. కౌన్సిలర్ కె.ప్రసాద్‌బాబు మాట్లాడుతూ కొందరు యూనియన్ నాయకుల పేరుతో చలామణి అవుతూ కార్మికుల పొట్ట కొడుతున్నారని ఆరోపించారు. వైస్‌చైర్మన్ బి.ఎ.నూర్ ఆజాం మాట్లాడుతూ సైదాపేటలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సంప్రదిస్తే అధికారులు ఫోన్ తీయడం లేదని, ప్రజాప్రతినిధులకు ఇచ్చే గౌరవం ఇదేనా? అంటూ మండిపడ్డారు. ఇదే సందర్భంలో కౌన్సిలర్ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ వార్డుల్లో ప్రొటోకాల్ పాటించని, కౌన్సిలర్లను గౌరవించని అధికారులు, సిబ్బందిని సరెండర్ చేయాలని కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. 16వవార్డు కౌన్సిలర్ పెరవలి రాజేష్ మాట్లాడుతూ..ఆయా వార్డు పరిధిలోని కార్మికులను ఆయా సచివాలయం పరిధిలో పనిచేసేలా చూడాలని కోరారు. అలాగే చిత్తూరుబస్టాండు కూరగాయల మార్కెట్ ఎదుట ట్రాఫిక్ సమస్యను వివరించారు. అనంతరం సాధారణ, అత్యవసర సమావేశంలోని అజెండాలోని అన్ని అంశాలనూ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది.

సంక్షేమం అభివృద్ధి సీఎం చంద్రబాబు లక్ష్యం

- కార్యకర్తలకు టీడీపీ అండ
- ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

వాల్మీకిపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరుపేదల సంక్షేమం, అభివృద్ధి సీఎం నారా చంద్రబాబు నాయుడి లక్ష్యమని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వాల్మీకిపురం మండలంలోని చింతపర్తి గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ప్రతి కార్యకర్తకూ టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం వాల్మీకిపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు నియోజకవర్గం వ్యాప్తంగా గత వైసీపీ ప్రభుత్వంలో కుంటుపడిన ప్రతి అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేసేదిశగా కృషి చేయడం జరుగుతుందన్నారు. టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ద్వారా ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. మండల పర్యటనకు విచ్చేసిన ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డికి గజమాలలతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమాలలో మాజీ మార్కెట్ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి, సర్పంచ్ మహితా శేషాద్రిరెడ్డి, నాయకులు క్రిష్టారెడ్డి, రాజేంద్రాచారి, పీవీ నారాయణ, చంద్రమౌళి, వల్లిగట్ల వెంకటరమణ, ద్వారకనాథరెడ్డి, సుధాకర్‌రెడ్డి, బొక్కసం బ్రదర్స్ పాల్గొన్నారు. వాల్మీకిపురం పట్టణానికి చెందిన మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, న్యాయవాది రమణ తల్లి సిద్దమ్మ ఇటీవల కొద్దిరోజుల క్రితం మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి రమణ ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానంటూ భరోసా ఇచ్చారు.

అంకాళమ్మ ఆలయ అభివృద్ధికి కృషి

పీలేరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పీలేరు మండలం వేపులబైలు పంచాయతీ జంగంపల్లె వద్దనున్న అంకాళమ్మను ఆలయ అభివృద్ధికి తన వంత సాయం అందిస్తానని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఆలయాన్ని సందర్శించి అంకాళమ్మ దేవతకు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆయనను ఆలయ సాంప్రదాయాల ప్రకారం పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, అమరనాథరెడ్డి, నారే సతీశ్, అబ్బవరం అమరనాథరెడ్డి, వసంతాల రాజా, గాయం వెంకటరెడ్డి, రెడ్డప్ప రెడ్డి, బీజేపీ నాయకులు చంద్రశేఖర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీల్లో విజయభారతి విద్యార్థుల ప్రతిభ



ఎస్పీ చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న విద్యార్థిని షణ్ముఖప్రియ

మదనపల్లె టౌన్, అక్టోబరు 29(ఆం ధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన, వకృత్వ పోటీల్లో మదనపల్లె విజయభారతి హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ ఎస్.సేతు పేర్కొన్నారు. మంగళవారం ఆయన మా ట్లాడుతూ రెండు రోజుల క్రితం రాయచోటిలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో తమ పాఠశాలకు చెందిన షణ్ముఖప్రియ ప్రథమ బహుమతిగా రూ.5వేలు సర్టిఫికెట్ అందుకున్నారన్నారు. అలాగే రెడ్డిసుజిత్ వ్యాసరచన, వకృత్వ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచి రూ.3వేలు నగదు బహుమతి సర్టిఫికెట్‌ను ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు చేతుల మీదుగా అందుకున్నారన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

పీలేరులో: జిల్లా స్థాయి వకృత్వ పోటీల్లో పీలేరులోని వీఎస్ఎన్ సిద్దార్థ ఒలింపియాడ్‌లో 9వ తరగతి చదువుతున్న సనా ముబారక్ విశేష ప్రతిభ చూపి ద్వితీయ స్థానం సాధించింది. రాయచోటిలోని తన కార్యాలయంలో జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు మంగళవారం విద్యార్థిని సనా ముబారక్‌కు అవార్డు అందించారు. విద్యార్థిని వీఎస్ఎన్ సంస్థల అధినేత్రి మాధవి, ప్రిన్సిపాల్ సురేశ్, ఉపాధ్యాయులు అభినందించారు.

కలికిరిలో: కలికిరి జడ్పీ బాలికోన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వి. హరితకు పోలీసు ప్రశంసా పత్రం లభించింది. 'నేరాల నియంత్రణలో యువత భాగస్వామ్యం' అనే అంశంపై జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థినుల మధ్య జరిగిన వకృత్వ పోటీల్లో హరిత మూడో స్థానంలో నిలిచింది. ఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో హరితకు ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ప్రశంసా పత్రం అందజేసి అభినందనలు చెప్పారు. పాఠశాల ఉపాధ్యాయినులు కూడా హరితను అభినందించారు.

తంబళ్లపల్లెలో లోవోల్టేజీ సమస్య రాకుండా చర్యలు

తంబళ్లపల్లె, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు, వ్యవసాయానికి మెరుగైన విద్యుత్ సరఫరా చేయడమే కాకుండా తంబళ్లపల్లెలో లోఓల్టేజీ సమ స్య రాకుండా చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ ఏడీఈ గోవిందరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన కన్నెమడు గు, తంబళ్లపల్లె 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కన్నెమడుగు సబ్‌స్టేషన్‌లో ఉన్న 3.15 ఏంవీఏ పవర్ ట్రాన్స్ పార్మర్ స్థానంలో 5 ఎంవీఏ ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఏడీఈ మాట్లాడుతూ..తంబళ్లపల్లెలో లోవోల్టేజి సమస్య ఉన్న ప్రాంతాలలో 100 కేవీఏ ట్రాన్స్ పార్మర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా కోసువారిపల్లె, కుక్కరాజుపల్లె, తంబళ్లపల్లె 33/11 విద్యుత్ ఉపకేంద్రాల్లో 5 అదనంగా ఇంకో 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌పార్మర్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలన్నారు. ఏడీఈ వెంట ఏఈ శేషుకుమార్, ఎల్‌ఐలు , లైన్‌మెన్లు తదితరులు ఉన్నారు.

ఆప్కాస్ ఉద్యోగుల ఆందోళన

మదనపల్లె టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మదనపల్లె సర్వజన బోధనాస్పత్రిలో ఆప్కాస్ ఉద్యోగులకు ఎనిమిది నెలలుగా వెతనాలు అందలేదని ఆందోళన చేపట్టారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఆప్కాస్ ఉద్యోగులు మాట్లాడుతూ మార్చిలో తాము ఉద్యోగాల్లో నియమితులయ్యామని, ఇంత వరకు వేతనాలు అందలేదన్నారు. అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నామన్నారు. తమ సమస్యపై వైద్యశాఖ అధికారులకు, సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని గత్యంతరం లేకనే నిరసన తెలుపుతున్నామన్నారు.

అర్హులైన రీలర్లకు న్యాయం చేయండి

మదనపల్లె టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మదనపల్లె సిరికల్చర్ కాలనీలో ఉన్న స్థలాలను అర్హులైన రీలర్లకు కేటాయించాలని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్థక శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు బీవైఎస్ అధ్యక్షుడు పునీత్ వినతి పత్రం ద్వారా విజ్ఞప్తి చేశారు. మంగళవారం విజయవాడలోని మంత్రిని కలిసి సిరికల్చర్ కాలనీలో వైసీపీ పాలనలో ఐదుగురు అనర్హులకు రీలింగ్ యూనిట్లు మంజూరు చేశారన్నారు. ఈ విషయమై ఎనిమిది నెలలుగా పోరాడుతున్నా, అధికారుల నుంచి స్పందన లేదన్నారు. ఈ విషయమై బాధితులు హైకోర్టులో కేసు వేశారన్నారు. ఇప్పటికైనా మంత్రి కలుగజేసుకుని సిరికల్చర్ కాలనీలో జరిగిన అక్రమాలపై విచారణ చేయించాలని విన్నవించారు.

మా భూమికి రక్షణ కల్పించండి

ములకలచెరువు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తమ తాతల కాలం నుంచి సంక్రమించిన భూమికి రక్షణ కల్పించాలని ములకలచెరువుకు చెందిన భాస్కర కుటుంబీకులు వెంకటేష్‌బాబు, మనోజ్‌కుమార్, నగేష్‌బాబు, రమేష్ బాబు కోరారు. ములకలచెరువులోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తమ భూమిని ములకలచెరువుకు చెందిన ఓ వ్యక్తి ఆక్రమించుకున్నాడని, న్యాయం చేయాలని తహసీల్దార్, పోలీసులకు ఫిర్యాదులు చేయగా తమపైనే తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నాడన్నారు. న్యాయం చేయాలని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లె జయచంద్రారెడ్డిని కలిసి విన్నవించామన్నారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కూడా ఫిర్యాదు పత్రాన్ని పంపినట్లు తెలిపారు.

భూ తగాదాలో ఇరువర్గీయుల దాడి

మదనపల్లె అర్బన్, అక్టోబరు29: భూ తగాదాల్లో ఇరువర్గీయులు దాడి చేసుకుని గాయపడిన సంఘటన మదనపల్లె మండలంలో జరిగింది. తాలుకా సీఐ కళా వెంకటరమణ విచారణ చేసి నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సుబ్బరాయుడుకు ఇద్దరు భార్యలు ఇందులో నారాయణమ్మకు శివ, నాగరాజ ఇద్దరు కుమారులు మరో భార్య సుబ్బమ్మకు ముగ్గురు నరసింహస్వామి, రాజశేఖర్, రమేష్ కుమారులు ఉన్నారు. ఇందులో తండ్రికి చెందిన 22 ఎకరాలు పొలం ఉంది. ఈ పొలం నరసింహస్వామి, నాగరాజ, శివలు మాత్రమే వ్యవసాయం చేసుకుంటూ రెండో భార్య కుమారు లైన రాజశేఖర్‌కు, రమేష్ భాగం ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈ విషయంగా సోమవాఅరం రాత్రి ఇరువర్గాలు రాడ్లతో దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో రాజశేఖర్, భార్య కె. కోమల(40). సుబ్బమ్మ కూతురు జయశ్రీ (22)లకు గాయాలయ్యాయి, వారు మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కోమల ఫిర్యాదు మేరకు తాలుకా సీఐ కళా వెంకటరమణ నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

రామసముద్రం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలో రెవెన్యూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని వాటి సత్వర పరిష్కారం కోసం చొరవ చూపాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తహసీల్దార్ నిర్మలాదేవికి సూచించారు. మంగళవారం మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తహసీల్దార్‌పై ఫిర్యాదు చేశారు. కేసీపల్లె, మట్లవారిపల్లె, చెంబకూరు జడ్పీ హైస్కూల్‌లకు ఆటస్థలం సమకూర్చాలని ఎంఈవో హేమలత ఎమ్మెల్యేను కోరారు.



అక్రమంగా పట్టాచేసుకున్నారు రద్దుపరచండి

- తహశీల్దార్‌కు రెండు గ్రామాల ప్రజల ఫిర్యాదు

బి.కొత్తకోట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సర్వేనెంబరు 860లో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఓ వ్యక్తి తన కుటుంబసభ్యుల పేరిట ఆన్‌లైన్ చేయించుకున్నాడని దానిని వెంటనే రద్దు పరిచి న్యాయం చేయాలంటూ బూదలవారిపల్లి, చిటిమిరెడ్డిగారిపల్లె గ్రామస్థులు కోరారు. దీనిపై మంగళవారం తహశీల్దార్ మహమ్మద్‌అన్సారీ బూదలవారిపల్లె వెళ్లి రైతుల ఫిర్యాదు పై విచారణ చేపట్టారు. ఆ స్థలం వ్యవసాయానికి అనుకూలమైనది కాదని, అయినా నిందితుల కుటుంబీకుల పేరున ఆన్‌లైన్‌లో 1బి వస్తోందన్నారు. గతంలో వారికి పట్టా ఇచ్చిన దాఖలాలు లేవని, వారి పేరున ఆన్‌లైన్ ఎలా అయిందనే విషయమై వారికి నోటీసు ఇచ్చి, సంజాయిషీ కోరతామన్నారు. ఆ స్థలం పట్టా ఇవ్వదగినది కాదని రెండుగ్రామాల పశువులకు మేతకు అనాదిగా ఉపయోగపడిందన్నారు. విచారణ అనంతరం తగు చర్యలు తీసుకుంటామన్నారు.

90శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు

నిమ్మనపల్లి, అక్టోబరు 29(అంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు 90శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలను అందించనున్నట్లు హెచ్‌వో ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 5ఎకరాలు తక్కువ భూమి కలిగిన ఎస్సీ, ఎస్టీ, సన్నకారు రైతులకు 90శాతం సబ్సిడీతో, మిగిలిన రైతులకు 70శాతం సబ్సిడీలో డ్రిప్ పరికారాలను ప్రభుత్వం అందించనున్నట్లు తెలిపారు. వేసవి కాలాన్ని రైతులు అధికమించి మంచి దిగుబడులు సాధించేందుకే పరికరాలను ఇస్తున్నట్లు తెలిపారు. వాటిని నవంబరు నెల నుంచి రైతులకు ఇస్తున్నామని వాటి కొరకు సంబంధిత ఆర్బీకేలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి తోడ్పాటు

మదనపల్లె టౌన్, అక్టోబరు 29(ఆం ధ్రజ్యోతి): నిత్యం చదువులతో బిజీ గా ఉండే విద్యార్థులకు క్రీడలు మా నసిక ఉల్లాసాన్నిస్తాయని ఎస్వీ యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ శివశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళ వారం మదనపల్లె వేదికగా ఎస్వీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో అంతర్ యూనివర్సిటీ క్రీడా పోటీలను సీని యర్ టీడీపీ నేత రాచకొండ బాబు రెడ్డి ప్రారంభించారు. స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో చెస్, టేబుల్ టెన్నీస్ క్రీడలు నిర్వహించగా పురుషుల విభాగంలో చెస్ టోర్నమెంట్‌లో ఉమ్మడి చిత్తూరు జిల్లా లోని 11 డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో తిరుపతి ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల విద్యార్థి ఎన్ఎస్ బాలాజీ విజేతగా నిలిచి రోలింగ్ షీల్డ్ అందు కున్నారు. రన్న రప్‌గా ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి కె.హర్షవర్ధన్ నిలిచారు. మిగిలిన వారిలో కె.అర విండ్, జె.యశ్వంత్, సి.జగపతి సౌత్‌జోన్ చెస్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ శివశంకర్‌రెడ్డి తెలిపారు. టేబుల్ టెన్నీస్ పోటీలో సింగిల్స్ విభాగంలో సీకామ్ కళాశాల విద్యార్థి ఎం.హరి బాబు విజేతగా నిలవగా, రన్నరప్‌గా జి.సంతోష్ నిలిచాడు. అలాగే డబుల్స్ విభాగంలో సీకామ్ డిగ్రీ కళాశాల విద్యార్థులు కె.విజయరాజ్, జె.ప్రశాంత్ జట్టు విజే తగా నిలిచారు. ద్వితీయ స్థానంలో ఎస్వీ కళాశాల జట్టు ఎ.స్వరాజ్, ఎ.మనోజ్ నిలిచారు. విజేతలకు జ్ఞానాం బిక డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ షీల్డులు అంద జేశారు. అలాగే బీటీ కళాశాలలో తొలిరోజున బాస్కెట్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్, హ్యాండ్ బాల్ క్రీడలు నిర్వహిం చారు. బుధవారం ఫైనల్స్ నిర్వహిస్తారని వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసు లు తెలిపారు. ఈ క్రీడలను రెండు కళాశాల ప్రిన్సిపాళ్లు రమాదేవి, ఆర్.కృష్ణవేణి, పీడీలు శ్రీనివాసులు, బాల సుబ్రమణ్యం, భాను, రాజు తదితరులు పర్యవేక్షించారు.

విద్యార్థులు లక్ష్యసాధనతో ముందుకు సాగాలి

కురబలకోట, అక్టోబరు 29: విద్యార్థులు లక్ష్యసాధనతో ముందుకు సాగాలని మోటివేటర్ రామ్మూర్తి పేర్కొన్నారు. మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్‌టి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ యువత చేతిలోనే దేశభవిష్యత్ ఆధారపడిఉంటుందన్నారు. ప్రతి విద్యార్థి విజయాలను సాధించి మంచి పేరుప్రఖ్యాతలను తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి గంగాదేవీ తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లెను జిల్లాగా ప్రకటించాలి

మదనపల్లె, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది డిసెంబరు చివరి నాటికి మదనపల్లెను జిల్లాగా ప్రకటించాలని జిల్లా సాధన సమితి కన్వీనర్ పీటీఎం శివప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జమిలి ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైతే జిల్లా ఏర్పాటుకు అవకాశం ఉండదని ఆయన స్పష్టం చేశారు.

కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట

ములకలచెరువు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెద్దపీట వేశారని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్ పేర్కొన్నారు. మండలంలోని చౌడసముద్రం, కాలువపల్లె గ్రామాల్లో మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టి అవగాహన కల్పించారు.

బాణసంచా దుకాణాల మార్పు

కలికిరి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కలికిరి పట్టణంలో దీపావళి సందర్భంగా ఏర్పాటయ్యే బాణసంచా దుకాణాల ఏర్పాటును మార్చారు. మామూలుగా బీడీ కాలనీ లేదా మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసే దుకాణాలను ఈ ఏడాది స్థానిక ఆర్టీసీ బస్టాండు వెనుక వైపున్న నజీర్ లేఔట్‌లోకి మార్చారు. మొత్తం ఆరు దుకాణాలకు లైసెన్సులు జారీ చేస్తున్నట్లు ఇన్‌చార్జీ తహసీల్దారు నవీన్ తెలిపారు.









